RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

| మల్కాజిగిరి | సంపుటి : 3 | సంచిక : 279 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ | మంగళవారం, మే,5, 2026 | పేజీలు : 8 వెల : రూ.4/- |
|---|---|---|---|---|---|
| MALKAJGIRI | VOLUME : 3 | ISSUE NO : 279 | EDITOR : MERUGU CHANDRAMOHAN | Tuesday, May, 5, 2026 | PAGES : 8 RS : 4 /- |





'ప్రాజెక్ట్ ఫ్రీడమ్'.. హర్మూజ్ జలసంధిపై

## ట్రంప్ కొత్త ప్లాన్

వాషింగ్టన్: పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతోన్న వేళ.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక నిర్ణయం తీసుకున్నారు. హర్మూజ్ జలసంధిలో చిక్కుకుపోయిన విదేశీ నౌకలను సురక్షితంగా గమ్యస్థానానికి చేర్చడానికి 'ప్రాజెక్ట్ ఫ్రీడమ్'ను ప్రకటించారు. ఈ మేరకు ఆయన ట్రూత్‌సోషల్‌లో పోస్టు పెట్టారు. ఈ యుద్ధంలో భాగం కాని చాలా దేశాలకు చెందిన నౌకలు ఈ జలసంధిలో చిక్కుకుపోయాయని ట్రంప్ తెలిపారు. వాటిని విడిపించుకోవడం కోసం ఆయా దేశాలు అమెరికా సాయాన్ని కోరాయన్నారు. వారి అభ్యర్థన మేరకు హర్మూజ్ నుంచి నౌకలు సురక్షితంగా బయటపడేందుకు తాము సాయం చేస్తామన్నారు. ఇందుకోసం ఆయా నౌకలకు అమెరికా బలగాలు మార్గనిర్దేశం చేస్తాయన్నారు. దీనికి 'ప్రాజెక్ట్ ఫ్రీడమ్' గా పేరు పెట్టారు. ఇది సోమవారం ఉదయం (పశ్చిమాసియా కాలమానం ప్రకారం) నుంచి ప్రారంభమవుతుందన్నారు. ఈ ప్రక్రియను ఒక మానవతా చర్యగా ట్రంప్ అభివర్ణించారు. చాలా నౌకల్లోని సిబ్బంది ఆహారం, నిత్యావసరాల నిల్వలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. తాము తలపెట్టిన ఈ మానవతా ప్రక్రియకు ఎలాంటి ఆటంకం కలిగినా.. దాన్ని బలప్రయోగంతో ఎదుర్కొంటామని ఆయన హెచ్చరించారు. ఈ సందర్భంగా తమ ప్రతినిధులు ఇరాన్‌తో సానుకూలమైన చర్చలు జరుపుతున్నారన్నారు. ఈ చర్చలు అందరికీ మంచి ఫలితాలిస్తాయని తాను భావిస్తున్నట్లు తెలిపారు.



మళ్లీ తెరపైకి..

## తుమ్మిడి హెట్టి..!

ఒప్పందానికి తెలంగాణ గ్రీన్ సిగ్నల్

### ఈనెల 7న సీఎం రేవంత్ రెడ్డి క్షేత్రస్థాయి పర్యటన

**నిర్మల్,తెలంగాణ దిశ :** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని తుమ్మిడి హెట్టి ప్రాజెక్ట్ అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. 2006లో వైఎస్సార్ శంకుస్థాపన చేసిన ఈ ప్రాజెక్టును గత బీఆర్ఎస్ ప్రభుత్వం పక్కనపెట్టింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి ప్రాజెక్టు పూర్తి కోసం పట్టుదలతో ఉన్నారు. మహారాష్ట్రతో ఒప్పందం కుదుర్చుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ నెల 7న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాజెక్టు క్షేత్రస్థాయి పర్యటన ఖరారైంది. అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశం అనంతరం, మహారాష్ట్ర నేతలతో సీఎం చర్చించనున్నారు. ప్రాజెక్టు పూర్తయితే ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల తూర్పు ప్రాంతానికి భారీ ప్రయోజనం చేకూరుతుంది. 60 వేల ఎకరాల వరకు ఆయకట్టుకు గ్రావిటీ ద్వారా సాగునీరు అందుతుందని రైతాంగం ఆశిస్తోంది. సిర్పూర్, ఆసిఫాబాద్, బెల్లంపల్లి, మంచిర్యాల నియోజక వర్గాల రైతులకు ఇది శుభవార్త కాగా, తుమ్మిడి హెట్టి నిర్మాణంపై ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రైతాంగంలో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. 2006లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 'జలయజ్ఞం' పేరుతో ప్రాణ హిత–చేవెళ్ల ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన తుమ్మిడి హెట్టి బహుళార్థసాధక ప్రాజెక్టు మరోసారి తెరపైకి వచ్చింది.

## కేరళంలో విజయంపై సీఎం రేవంత్‌రెడ్డి ఆసక్తికర ట్వీట్



**హైదరాబాద్,తెలంగాణ దిశ :** కేరళంలో యూడీఎఫ్ కూటమి విజయం పై సీఎం రేవంత్ రెడ్డి సోషల్ మీడియా ద్వారా స్పందిం చారు. ఇలాంటి అసాధారణమైన, కఠోరమైన స్ఫూర్తిదాయ కరమైన విజయం సాధించినందుకు నాయకులకు, కార్య కర్తలను అభినిందించారు. ఈ చారిత్రాత్మక విజయానికి నాయకత్వం వహించిన రాహుల్ గాంధీ, ఖర్గే, ప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్, దీపాదాస్ మున్షిలకు పార్టీ, కేడర్ తో కలిసి అభినందనలు తెలుపుతున్నానని పేర్కొన్నారు. కేరళ ప్రచారం సందర్భంగా తనపై ప్రేమ కురిపించినందుకు గానూ యూడీఎఫ్ మద్దతుదారులకు, ప్రజలకు ధన్యవాదా లు తెలియజేస్తున్నానని తెలిపారు. తెలంగాణ ప్రజల తరపున ఎల్లప్పుడూ కృతజ్ఞుడనై ఉంటానని పేర్కొన్నారు. కేరళ, తెలంగాణ రాష్ట్రాల ప్రజలు ప్రగతిశీల విలువలు, ప్రజాస్వామ్య స్ఫూర్తి గల ప్రజలని అన్నారు. రెండు రాష్ట్రా లు అభివృద్ధిని విశ్వసిస్తాయని, దశాబ్దంపాటు నిరాశ,ద్రోహం తరవాతకాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో గొప్ప భవిష్యత్ అందించడానికి సిద్ధంగా ఉన్నామని పేర్కొ న్నారు. ఇదిలా ఉంటే కేరళం ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్ రెడ్డి సైతం పాల్గొన్నారు. కేరళ లోని అధికార సీపీఎంపై విమర్శలు కురిపిస్తూ ఆయన వార్తల్లో నిలిచారు. ఈ క్రమంలో మాజీ సీఎం విజయన్ సైతం రేవంత్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు.



రైతులకు మద్దతుగా కదం తొక్కుతున్న..

## బీఆర్ఎస్

ఎక్కడికక్కడ ప్రభుత్వాన్ని నిలదీయాలని పార్టీ శ్రేణులకు కేటీఆర్ పిలుపు

**సంగారెడ్డి,తెలంగాణ దిశ :** సీఎం రేవంత్ రెడ్డి పాలనలో రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎప్పుడూ సమయానికి రైతుబంధు వేయలేదని విమర్శించారు. రైతులకు మాయమాటలు చెప్పి కాంగ్రెస్ మోసం చేసిందని మండిపడ్డారు. సంగారెడ్డి జిల్లా సదాశివపేటలోని శనగల కొనుగోలు కేంద్రాన్ని కేటీఆర్ పరిశీలించారు. ఈసందర్భంగా రైతులతో ముచ్చటించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పంటలను కొనకుండా గోస పుచ్చుకుంటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.



ఐదు రాష్ట్రాల ఎన్నికల

## ఫలితాలు

అసోం, పుదుచ్చేరిల్లో అధికారం నిలబెట్టుకున్న బిజెపి

బెంగాల్లో పాగా వేసిన బిజెపి.. మట్టి కరిచిన మమతా బెనర్జీ

కేరళలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడిఎఫ్ విజయం

### తమిళనాట విజయ్ కొత్త కెరటం

న్యూఢిల్లీ, మే4 : ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు బిజెపికి అనుకూలంగా వచ్చాయి. అసోం, పుదు చ్చేరిలో అధికారం నిలుపుకున్న బిజెపి, బెంగాల్లోనూ విజయభేరి మోగించింది. కేరళలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడిఎఫ్ విజయం సాదించింది. తమిళనాట విజయ్ నేతృత్వంలోని టివికె అనూహ్యంగా దూసుకుని వచ్చింది. యావత్ దేశం ఉత్కంఠగా ఎదురు చూస్తున్న పశ్చిమ బెంగాల్, కేరళ, అస్సాం, తమిళనాడు, పుదుచ్చేరీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు సోమవారం వెలువడ్డాయి. ఎగ్జిట్ పోల్స్ అంచ నాలను తలకిందులు చేస్తూ తమిళ నాడులో నటుడు విజయ్ నేతృత్వం లోని టీవీకే పార్టీ హవా కొనసాగింది. డీఎంకే, అన్నాడీఎంకేను దాటి ఆధిక్యంలో కొనసాగుతోంది. పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్‌కు గట్టి షాకిస్తూ భాజపా దూసుకెళ్లింది.



బెంగాల్‌లో పాగా వేసిన

## బిజెపి

205 సీట్లతో భారీ విజయం నమోదు

మట్టి కరిచిన మమతా బెనర్జీ టిఎంసి

కోల్‌కతా : బెంగాల్ దంగల్‌లో బిజెపి గెలిచింది. అనుకున్నట్లుగానే మమతను మట్టి కరిపించింది.టీఎంసీ కంచుకోటను భాజపా బద్దలు కొట్టింది.15 ఏళ్లుగా ఎదురులేకుండా బెంగాల్‌ను పాలించిన మమతా బెనర్జీకి గట్టి షాకిచ్చింది. గత రెండు దఫాల్లో సాధ్యంకాని విజయం ఈసారి కమలనాథుల వశమైంది. పశ్చిమబెంగాల్‌లో అనుసరించిన పదునైన వ్యూహం ఈసారి పార్టీకి కచ్చితమైన ఫలితాన్ని తీసుకొచ్చింది. భాజపా అగ్రనేత అమిత్‌షా అన్నీ తానై ఈ ఎన్నికల్లో పార్టీని నడిపించారు. మొత్తం 293 స్థానాల్లో 205 స్థానాల్లో బిజెపి ఘన విజయం సాధించింది. దీంతో దీదీని ఓడించడం అంత సులువు కాదని గ్రహించిన భాజపా వ్యూహాన్ని మార్చుకొంది. సునీల్ భన్సల్ పార్టీ ఇన్‌ఛార్జిగా.. వ్యవస్థీకృత మార్పులు తీసుకొచ్చారు. అమిత్‌షాకు భన్సల్ నమ్మకస్తుడని పేరు. టికెట్ల పంపిణీ విషయంలో సెలబ్రిటీలు, ఫిరాయింపుదార్లకు ప్రాధాన్యం ఇవ్వకుండా క్షేత్రస్థాయిలో పట్టున్న పార్టీ నాయకులకు భాజపా పెద్దపీట వేసింది. ప్రతి బూత్‌స్థాయిలో 300 ఓట్లను సమీకరించగల వారికే టికెట్లు కేటాయించింది. స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయిన చోట్ల పుంజుకోవడా నికి బూత్ స్థాయి మేనేజ్‌మెంట్‌కు తెరతీసింది.



తెలంగాణపై బీజేపీ

## నజర్

హైదరాబాద్,తెలంగాణ దిశ: తెలంగాణ రాజకీయాల్లో మరోసారి వేడి రాజు కుంది. ప్రధాని నరేంద్ర మోడీ పర్యటన ఖరారు కావడంతో రాష్ట్ర బీజేపీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. మూడోసారి ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మోదీ తొలిసారి తెలంగాణ గడ్డపై అడుగుపెడుతుండటం ప్రాధాన్యత సంతరిం చుకుంది. మే 10న హైదరాబాద్ వేదికగా జరగనున్న ఈ పర్యట న కేవలం ప్రభుత్వ కార్యక్రమాలకే పరిమితం కాకుండా, రాబోయే ఎన్నికలకు శంఖారావంగా మారుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.మే 10న హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో భారీ బహిరంగ సభను నిర్వహించేందుకు బీజేపీ సర్వసన్నద్ధమవు తోంది. ఈ సభకు 'జానగ్రహ సభ' అని పేరు పెట్టంది. గత ఎన్నికల్లో సాధించిన విజయాలు, ప్రభుత్వ వ్యతిరేక తను తమకు అనుకూలంగా మార్చుకోవాలనే లక్ష్యంతో ఈ పేరును ఖరారు చేసినట్లు తెలుస్తోంది.ఈ సభ ద్వారా రాష్ట్రంలోనిఅధికార కాంగ్రెస్, విపక్ష బీఆర్ఎస్ పార్టీలపై నేరుగా విమర్శనాస్త్రాలు సంధించే అవకాశం ఉంది. రాష్ట్రవ్యాప్తంగా భారీ ఎత్తున జన సమీకరణ చేసి, కేడర్‌లో నూతన ఉత్తేజాన్ని నింపాలని హైకమాండ్ భావిస్తోంది.రాజకీయ సభతో పాటు, హైదరాబాద్ పరిధిలో..

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** తెలంగాణలోని అన్నదాత నలు రుణవిముక్తులను చేయడంతో పాటు, వారిని ఆర్థికంగా బలోపేతం చేయటమే రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం లక్ష్యమని రాష్ట్ర రెవె న్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీని వాస్ రెడ్డి స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా కూసుమంచిలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. రైతు డిక్లరేష న్‌లో ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వం అక్షరాలా అమలు చేస్తోందని వెల్లడిం చారు. కాంగ్రెస్ పార్టీ చారిత్రాత్మక రైతు డిక్లరేషన్‌ను ప్రకటించిన వరం గల్ సభాస్థలిలోనే..ఈ నెల 5,6,7 తేదీల్లో భారీ కార్యక్రమం నిర్వహిం చనున్నట్లుమంత్రిప్రకటించారు. వేలా ది మంది రైతులకు రాయితీపై ఆధుని క వ్యవసాయ యంత్ర పరికరాలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

తెలంగాణ రైతులకు

## తీపి కబురు

సబ్సిడీపై వ్యవసాయ యంత్ర పరికరాలు - మంత్రి పొంగులేటి



గత ప్రభుత్వం పదేళ్ల పాలనలో రైతులను విస్మరించిందని, కనీసం రాయితీపై పరికరాలు కూడా అందించలేదని ఆయన విమర్శించారు. రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం 25 లక్షల మంది రైతులకు ఒకేసారి రూ.21 వేల కోట్ల రుణమాఫీ చేసి రికార్డు సృష్టించామని మంత్రి గుర్తు చేశారు.

# హత్యకు దారి తీసిన అక్రమ సంబంధం

## - ప్రియురాలు, ఆమె కుమారుడు చేతిలో ప్రియుడి హత్య

**కుత్బుల్లాపూర్, మే 04, (తెలంగాణ దిశ) :**అక్రమ సంబంధం ఒక వ్యక్తి దారుణ హత్యకు కారణమైంది. ప్రియురాలు, ఆమె కుమారుడు కలిసి కత్తితో ఈ దారుణానికి తెగబడ్డారు. జీడిమెట్ల పోలీసుల కథనం ప్రకారం.. చింతల్ సమీపంలోని చెరుకుపల్లి కాలనీలో గత 45 రోజుల క్రితం సంగారెడ్డికి చెందిన గార్లపాటి అరుణ (44), ఆమె కుమారుడు సాయి రత్నం (18), ఆంధ్రప్రదేశ్ అన్నమయ్య జిల్లాకు చెందిన శివారెడ్డిలు చెరుకుపల్లి కాలనీకి చెందిన పి. కృష్ణ అనే ఇంటి యజమానిని సింగల్ రూమ్ అద్దెకు ఇవ్వమంటూ అడిగారు. నెలకు రూ. 3600 అద్దెకు ఇంటి యజమాని కృష్ణ అంగీకరించాడు. అరుణ ఆమె కుమారుడు సాయి రత్నం, శివారెడ్డిలు జీవనోపాధి నిమిత్తం కూలీ పనులు చేసుకుంటూ కాలం గడిపేవారు. అయితే గార్లపాటి అరుణ, శివారెడ్డిల మధ్య వివాహేతర సంబంధం ఏర్పడింది. గత కొద్ది రోజులుగా అతిగా మద్యం సేవిస్తూ శివారెడ్డి అరుణను ఆమె కుమారుడు సాయి రత్నం ను తరచూ వేధించసాగాడు. దీంతో తల్లి కొడుకులు శివారెడ్డిపై విపరీతమైన పగ పెంచుకున్నారు. ఎలాగైనా శివారెడ్డిని చంపివేయాలని పథకం వేశారు. ఆదివారం సాయంత్రం అతిగా మద్యం సేవించిన శివారెడ్డి ఇంటికి వచ్చి అరుణను ఆమె కుమారుడు సాయి రత్నంను ఎప్పటి లాగానే గొడవకు దిగి పరస్పరం కొట్టుకున్నారు. దీంతో ఆదివారం రాత్రి గార్లపాటి అరుణ, ఆమె కుమారుడు సాయి రత్నంలు కలిసి కత్తితో శివారెడ్డి గొంతుపై తీవ్రంగా గాయపరిచారు. విపరీతంగా రక్తస్రావం జరగడంతో శివారెడ్డి మరణించాడు. జరిగిన మరణాన్ని ఎవరికీ తెలియకుండా ఉండడానికి తల్లి కొడుకులు ఇద్దరు దుప్పట్లో శివారెడ్డి మృతదేహాన్ని కప్పివేసి తాళ్లతో చుట్టారు. అనంతరం రూమ్ లో పడిన రక్తపు మరకలను నీటుగా తుడిచివేశారు. ఈ విషయమై అదే ఇంట్లో పై ఫ్లోర్ లో అద్దెకు నివసించే వారు అనుమానంతో ఇంటి ఓనర్ అయిన కృష్ణకు సమాచారం అందివ్వడంతో సోమవారం మధ్యాహ్నం అతను వెళ్లి తల్లి కొడుకులను విచారించగా మొదట ఏమీ జరగలేదంటూ దబాయించారు. అనంతరం దుప్పట్లతో మూట కట్టి ఉన్న పార్సల్ ఏంటి అని దబాయించగా తామిద్దరం కలిసి శివారెడ్డిని కత్తితో పొడిచి చంపామని తల్లి కొడుకులు అంగీకరించారు. ఇంటి యజమాని ఫిర్యాదు మేరకు జీడిమెట్ల పోలీసులు సంఘటన స్థలాన్ని సందర్శించి కేసు వివరాలు నమోదు చేసుకున్నారు. ప్రతిరోజు అతిగా మద్యం సేవించి తన తల్లిని, తనను మానసికంగా శివారెడ్డి తరచూ వేధించే వాడని, అందుకే అతనిని హత్య చేశామని సాయిరత్నం అంగీకరించాడు. అయితే గార్లపాటి అరుణకు శివారెడ్డి మధ్య వివాహేతర సంబంధం ఉన్నదని ఈ విషయంలోనే తరచూ సాయి రత్నంకు అతని తల్లికి, శివారెడ్డికి సాయి రత్నంకు గొడవలు జరిగేవని పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం శివారెడ్డి మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని జీడిమెట్ల పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. నిందితులు గార్లపాటి అరుణ, ఆమె కుమారుడు సాయి రత్నంలను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు.



# ప్రశాంత వాతావరణంలో బక్రీద్ పండుగను జరుపు కోవాలి

## - కుషాయిగూడలో పీస్ కమిటీ సమావేశం

**కుషాయిగూడ, మే 04, (తెలంగాణ దిశ) :**బక్రీద్ పండుగను శాంతియుతంగా, సౌహార్ద వాతావరణంలో జరుపుకోవాలని సర్కిల్ ఇన్ స్పెక్టర్ భాస్కర్ రెడ్డి సూచించారు. సోమవారం కుషాయిగూడ పోలీస్ స్టేషన్‌లో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముస్లిం మత పెద్దలు, హిందూ సమాజ ప్రతినిధులు, కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శాంతిభద్రతలను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యతని, మతసామరస్యాన్ని పరిరక్షించడం ద్వారానే సమాజంలో శాంతి నెలకొంటుందని తెలిపారు. ప్రత్యేకంగా మసీదులు, ఈద్గాల వద్ద ప్రజలు అధికంగా గుమికూడే ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, అవి సక్రమంగా పనిచేసేలా చూసుకోవాలని సూచించారు. ఎలాంటి అనుమానాస్పద కార్యకలాపాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. పండుగ సందర్భంగా రహదారుల పై ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా సహకరించాలని, పోలీసుల సూచనలు పాటించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో పలు మసీదులకు చెందిన పెద్దలు, మైనారిటీ నాయకులు తమ అభిప్రాయాలు వ్యక్తం చేస్తూ పోలీసుల సూచనలకు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో సబ్ ఇన్ స్పెక్టర్లు సుధాకర్ రెడ్డి, వెంకన్న, సునీల్ రెడ్డి, సాయిలు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



# మల్కాజిగిరిలో అడ్డదిడ్డంగా వాహనాల పార్కింగ్

## - ఒక్కరోజే 2,727 కేసులు

**మల్కాజిగిరి, మే 04, (తెలంగాణ దిశ) :** నగరంలో ట్రాఫిక్ కష్టాలను తీర్చేందుకు మల్కాజిగిరి ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝుళిపించారు. నిబంధనలకు విరుద్ధంగా, అడ్డ దిడ్డంగా వాహనాలను పార్క్ చేసిన వారిపై సోమవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. తిరుమలగిరి, మల్కాజిగిరి డివిజన్ల పరిధిలో చేపట్టిన ఈ తనిఖీల్లో భారీగా జరిమానాలు విధించారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి, ఐపిఎస్ ఆదేశాల మేరకు, ట్రాఫిక్ డిసిపి కె. రాహుల్ రెడ్డి పర్యవేక్షణలో ఈ ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ ఒక్కరోజే నిబంధనలు ఉల్లంఘించిన వారిపై మొత్తం 2,727 కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వీరి నుంచి రూ. 5,50,100 జరిమానాగా వసూలు చేశారు. ముఖ్యంగా నో-పార్కింగ్ జోన్లు, ప్రధాన రహదారులు, జంక్షన్ల వద్ద ట్రాఫిక్‌కు ఆటంకం కలిగిస్తున్న వాహనాలపై పోలీసులు చర్యలు తీసుకున్నారు. అడ్డదిడ్డంగా పార్క్ చేసిన వాహనాల వల్ల సాధారణ ప్రయాణికులతో పాటు అత్యవసర సేవలందించే అంబులెన్సులు, ఫైర్ ఇంజన్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని డిసిపి రాహుల్ రెడ్డి పేర్కొన్నారు. ఇలాంటి వాహనాలను క్రేన్ల సహాయంతో తొలగించి, యజమానులపై జరిమానాలు విధించారు. వాహనదారులు తమ వాహనాలను కేటాయించిన పార్కింగ్ స్థలాల్లోనే నిలపాలి. రహదారులపై వాహనాలను వదిలి వెళితే కఠిన చర్యలు తప్పవు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం ఇలాంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయి. ఈ డ్రైవ్‌లో తిరుమలగిరి, మల్కాజిగిరి ఏసీపీలతో పాటు ఆయా డివిజన్ల ట్రాఫిక్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# మండు వేసవిలో వృథాగా పోతున్న వేలాది లీటర్ల మంజీర నీరు..

## - పట్టించుకోని జలమండలి అధికారులు...
## - అసలే వేసవి కాలం, తాగునీటి కష్టాలు, మంజీర నీరు నేల పాలు...






ఏఎస్ రావునగర్, మే 04, (తెలంగాణ దిశ) :కాప్రా సర్కిల్ సౌత్ కమలా నగర్ వసుంధర ఉమన్స్ కళాశాల, గీతం జూనియర్ కళాశాల ఎదురుగా ఉన్న రోడ్డులో ప్లాట్ నంబర్ 28 శ్రీ నిధి గర్ల్స్ హాస్టల్ బిల్డింగ్ ముందు ఉదయం నుండి వేలాది లీటర్ల మంజీర నీరు వృథాగా నేలపై ఏరులై పారుతుంది. అసలే మండే వేసవి కాలం, ప్రజలు తాగునీరు దొరక్క ఇబ్బందులు పడుతుంటే ఇక్కడ మాత్రం మంచినీరు వృథాగా పోతుంది. లక్షలాది లీటర్ల మంజీర నీరు వృథాగా పోతున్నా జలమండలి, మున్సిపల్ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఏమీ తెలియనట్లు అటువైపు వెళ్ళి చూడటం లేదు, వెంటనే జలమండలి అధికారులు మరమ్మత్తులు చేపట్టి మంజీర నీరు వృథాగా పోకుండా మంజీర పైప్ లైన్ బాగు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# ప్రజావాణిలో అధికారులు గైర్హాజరు -- ఖాళీ కుర్చీలకే వినతిపత్రం

**కుత్బుల్లాపూర్, మే 04, (తెలంగాణ దిశ) :** జీడిమెట్ల సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణికి అధికారులు హాజరు కాలేదు. కాలనీ సమస్యలపై వినతిపత్రాలు ఇవ్వడానికి వచ్చిన అసోసియేషన్ సభ్యులకు నిరాశ ఎదురైంది. దీంతో ఖాళీ కుర్చీలకే వినతిపత్రాలు సమర్పించి వెనుదిరిగారు. అధికారుల నిర్లక్ష్యంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనైనా బాధ్యతగా వ్యవహరించి సమస్యలను పరిష్కరించాలని సూదుల సంపత్ గౌడ్ డిమాండ్ చేశారు.




# జవహర్ నగర్‌లో పుట్టగొడుగుల్లా అక్రమ నిర్మాణాలు

## - పట్టించుకోని అధికారులు





**జవహర్ నగర్, మే 04 : (తెలంగాణ దిశ)** :కీసర సర్కిల్ పరిధిలోని జవహర్ నగర్ లో అక్రమ నిర్మాణాలు రోజురోజుకు పెరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా కేసీఆర్ కూరగాయల మార్కెట్ ఎదురుగా ఉన్న సంతోష్ నగర్, వికలాంగుల బస్తీ సమీపంలోని సిటిజన్ కాలనీతో పాటు అంబేద్కర్ నగర్ నుంచి చెన్నాపురం జయశంకర్ కాలనీకి వెళ్లే ప్రధాన రహదారిపై అనుమతులు లేకుండా నిర్మాణాలు కొనసాగుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. స్థానికుల వివరాల ప్రకారం పలు ప్రాంతాల్లో భవన నిర్మాణాలకు సంబంధించి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా నిర్మాణాలు చేపడుతున్నారని, దీని వల్ల ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం కోల్పోతు ఒదని తెలిపారు. అయినప్పటికీ సంబంధిత శాఖల అధికారులు పరిశీలన చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఇలాంటి అక్రమ నిర్మాణాలు భవిష్యత్తులో ట్రాఫిక్ సమస్యలు, పారిశుద్ధ్య సమస్యలు, భద్రతా సమస్యలకు దారి తీసే అవకాశం ఉందని హెచ్చరి స్తున్నారు. వెంటనే అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.




# భౌరంపేట్ లో బీజేపీ విజయోత్సవ సంబరాలు

**కుత్బుల్లాపూర్, మే 04, (తెలంగాణ దిశ) :**పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరి రాష్ట్రాలలో భారతీయ జనతా పార్టీ అఖండ విజయాన్ని సాధించిన సందర్భంగా సిఎంసి దుండిగల్ సర్కిల్ పరిధిలోని భౌరంపేట్ డివిజన్‌లో బీజేపీ శ్రేణులు ఘనంగా విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తలు మిఠాయిలు పంచుకుని, టపాకాయలు కాల్చి ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా ప్రధాని నరేంద్ర మోదీ గారి చరిష్మా పార్టీ విజయానికి ప్రధాన కారణమని పేర్కొన్నారు. దేశభక్తి, కఠోర శ్రమ, అంతర్జాతీయ స్థాయిలో భారత ఖ్యాతిని పెంచడం వంటి అంశాలలో మోదీ ప్రభుత్వం ముందంజలో ఉందని అన్నారు. మహిళా సాధికారత, యువతకు నైపుణ్యాభివృద్ధి (స్కిల్ డెవలప్మెంట్), పేదల సంక్షేమం వంటి రంగాల్లో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ప్రజలకు దగ్గరగా ఉన్నాయని వివరించారు. ఇక దక్షిణ భారత రాష్ట్రాల్లో కూడా బీజేపీ బలం పెరుగుతుందని, ముఖ్యంగా గతంలో ఒక్క సీటు కూడా రాని ప్రాంతాల్లో ప్రస్తుతం మూడు సీట్లు సాధించడం శుభపరిణామమని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దుండిగల్ సర్కిల్ భౌరంపేట్ డివిజన్ అధ్యక్షుడు పీసరి కృష్ణారెడ్డి, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు గోనే మల్లారెడ్డి, సీనియర్ నాయకులు సరుగారి సత్తిరెడ్డి, డి. ప్రభాకర్ రెడ్డి, కమ్మరి రమేష్ చారి, ఆర్. రమేష్, అందె అశోక్, కుమ్మరి నాగరాజు, వై. జంగారెడ్డి, నల్ల రాజిరెడ్డి, కొమ్ము ప్రశాంత్, నల్ల జైపాల్ రెడ్డి, సోను, అతీష్ బాబు, నర్సింగ్, నవీన్, ప్రమోద్ కుమార్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



# బీజేపీకి మూడు రాష్ట్రాల్లో ఘన విజయం.. సుచిత్ర చౌరస్తాలో సంబరాలు




**కుత్బుల్లాపూర్, మే 04, (తెలంగాణ దిశ) :**మూడు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ ఘన విజయాన్ని సాధించిన సందర్భంగా, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సుచిత్ర ఎక్స్ రోడ్ వద్ద బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీగా సంబరాలు నిర్వహించారు. పటాకులు కాల్చి, మిఠాయిలు పంచుతూ విజయోత్సాహాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షులు ఎస్. మల్లారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు మూగా జయశ్రీ, మేడ్చల్ అర్బన్ జిల్లా జనరల్ సెక్రటరీ గిరివర్ధన్ రెడ్డి ఇతర ప్రముఖ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఇప్పటి విజయంతో బీజేపీ మరింత బలపడింది. వచ్చే లక్ష్యం తెలంగాణ రాష్ట్రంలో అధికారాన్ని సాధించడం. అందుకోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఇక రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని, ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉందని వారు పేర్కొన్నారు. అలాగే రాబోయే మే 10న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారు తెలంగాణకు రానున్నారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగే భారీ బహిరంగ సభ జనాగ్రహ సభను విజయవంతం చేయాలని, పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై దీన్ని విజయవంతం చేయాలని నాయకులు కోరారు.

# రాధిక చౌరస్తాలో ఘనంగా బీజేపీ విజయోత్సవ సంబరాలు

**ఏఎస్ రావునగర్, మే 04, (తెలంగాణ దిశ) :**డాక్టర్ ఏఎస్ రావునగర్ డివిజన్ అధ్యక్షురాలు శ్రీమతి తుమ్మల సంధ్యా నర్సిరెడ్డి గారి ఆధ్వర్యంలో రాధిక క్రాస్ రోడ్స్ వద్ద నిర్వహించిన బీజేపీ విజయోత్సవ సంబరాలు ఘనంగా నిర్వహించారు. పశ్చిమ బెంగాల్, అస్సాం రాష్ట్రాల్లో భారతీయ జనతా పార్టీ సాధించిన విజయాన్ని పురస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొని ఉత్సాహ భరిత వాతావరణాన్ని సృష్టించారు. బీజేపీకి అనుకూలంగా నినాదాలు చేస్తూ, బాణసంచా కాలుస్తూ, మిఠాయిలు పంచుకుంటూ ఆనందాన్ని పంచుకున్నారు. జాతీయ స్ఫూర్తితో జరిగిన ఈ సంబరాలు అక్కడి ప్రజల్లో ఉత్సాహాన్ని నింపాయి. పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న నాయకత్వానికి అభినందనలు తెలుపుతూ, భవిష్యత్తులో కూడా ఇదే ఉత్సాహంతో ముందుకు సాగాలని కార్యకర్తలు ఆకాంక్షించారు.



# మహిళా రిజర్వేషన్ బిల్లును తక్షణమే అమలు చేయాలి

## మహిళా కాంగ్రెస్ పోస్ట్‌కార్డు ఉద్యమం - మహిళా కాంగ్రెస్ మేడ్చల్ అధ్యక్షురాలు రాజనోళ్ల లక్ష్మి

**కుత్బుల్లాపూర్, మే 04, (తెలంగాణ దిశ) :** మహిళా రిజర్వేషన్ బిల్లును తక్షణమే అమలు చేయాలని కోరుతూ మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం పోస్ట్ కార్డు ఉద్యమాన్ని చేపట్టారు. మహిళా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు అల్కాలాంబ సూచనల మేరకు రాష్ట్ర అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ ఆదేశాల మేరకు మహిళా కాంగ్రెస్ మేడ్చల్ అధ్యక్షురాలు రాజనోళ్ల లక్ష్మి ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ నియోజక వర్గ ఏ బ్లాక్ అధ్యక్షురాలు రేణుక రెడ్డి అధ్యక్షతన పోస్ట్ కార్డులపై సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ, దేశంలో మహిళలు అన్ని రంగాల్లో ప్రతిభ చాటుతున్నప్పటికీ, రాజకీయాల్లో మాత్రం తగిన అవకాశాలు లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లు అమలైతే మహిళలకు శాసనసభలు, పార్లమెంట్‌లో సముచిత ప్రాతినిధ్యం లభించి, వారి సమస్యలు సమర్థవంతంగా పరిష్కారం అవుతాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం మహిళల సంక్షేమం గురించి మాటలకే పరిమితమైందని విమర్శించారు. వెంటనే మహిళా రిజర్వేషన్ బిల్లును అమలు చేసి తమ నిబద్ధతను చాటుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. మహిళలు ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో ముందుకు రావాలంటే ఇటువంటి చట్టాలు అత్యవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జాజాల రమ్య, ఏ బ్లాక్ ఉపాధ్యక్షురాలు అశ్విని, కార్యదర్శి లతా, లలితమ్మ, మాధవి రెడ్డి, సహాయ కార్యదర్శి జాజాల అర్చన, డివిజన్ అధ్యక్షురాలు సుజాత, యాదవ్ వారి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



# సంపాదకీయం

## బీజేపీకి రాహుల్ బలం..!

జాతీయ రాజకీయాల్లో శతాబ్ద కాలం పైగా చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీ, ప్రస్తుత మోదీ శకాన్ని ఎదుర్కోవడంలో అనుసరిస్తున్న వ్యూహాలు ఆ పార్టీని మరింత ఆత్మరక్షణలో పడేస్తున్నాయి. ప్రధాని నరేంద్ర మోదీ అనుసరిస్తున్న రాజకీయ ఎత్తుగడలను దీటుగా ఎదుర్కోవడంలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విఫలమవుతోంది. మోదీ ఏ నిర్ణయం తీసుకున్నా, దానికి నిర్మాణాత్మకమైన ప్రత్యామ్నాయాన్ని చూపాల్సింది పోయి.. గుడ్డిగా వ్యతిరేకించడమే పనిగా పెట్టుకుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. మోదీ పరిపాలనపై చర్చించకుండా కేవలం ఆయనను వ్యక్తిగతంగా టార్గెట్ చేయడం వల్ల ప్రజల్లో కాంగ్రెస్ పట్ల ప్రతికూలత పెరుగుతోంది. ''గతంలో 'మౌత్ కా సౌదాగర్' నుంచి మొన్నటి 'చౌకీదార్ చోర్ హై' వరకు, ఇప్పుడు ప్రధానిని 'టెర్రరిస్టు' అంటూ సంబోధించే స్థాయికి కాంగ్రెస్ నేతలు దిగజారడం ఆ పార్టీకే నష్టం చేకూరుస్తోంది. ఒక దేశ ప్రధానిని అప్రజాస్వామిక పదజాలంతో దూషించిన ప్రతిసారీ మోదీ దానిని అస్త్రంగా మార్చుకుని ప్రజాక్షేత్రంలో సానుభూతి పొందుతున్నారు. కాంగ్రెస్ ఉక్రోశం నుంచి పుట్టుకొస్తున్న ఇటువంటి వ్యాఖ్యలు రాహుల్ గాంధీ, ఖర్గే నాయకత్వాన్ని మరింత బలహీనంగా చూపిస్తున్నాయి. జాతీయ భావాలు బలంగా ఉన్న ఈ రోజుల్లో, ప్రధానిని ఉగ్రవాదితో పోల్చడం సామాన్య ఓటర్లకు మింగుడుపడటం లేదు. కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం ఏ సిద్ధాంతంపై నడుస్తోంది? ఏ వర్గాల కోసం పోరాడుతోంది? అనే విషయంలో ప్రజలకే కాదు, ఆ పార్టీ శ్రేణులకు కూడా స్పష్టత లేదు. బీజేపీ హిందుత్వ కార్డును ఎదుర్కోవడానికి సాఫ్ట్ హిందుత్వ ను అనుసరించాలా లేక సెక్యులరిజం వైపు ఉండాలా అనే సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతోంది. క్షేత్రస్థాయిలో పార్టీ నిర్మాణం కుప్పకూలుతున్నా, అగ్ర నాయకత్వం కేవలం ఢిల్లీలో కూర్చుని సోషల్ మీడియా వార్లకే పరిమితమవుతోంది. ఈ చేతకాని రాజకీయాల వల్ల రాహుల్ గాంధీ ఇమేజ్ బిల్డప్ అవ్వడం కంటే, మరింత చులకన అవుతోంది. జాతీయ స్థాయిలో బీజేపీకి ప్రత్యామ్నాయంగా నిలబడాల్సిన కాంగ్రెస్, రోజురోజుకూ ప్రాంతీయ పార్టీల దయాదాక్షిణ్యాలపై ఆధారపడే స్థితికి చేరుకుంది. 2029 సార్వత్రిక ఎన్నికల ముందు మహిళా రిజర్వేషన్ బిల్లుతో సహా లోక్‌సభ సీట్లను పెంచాలనే బీజేపీ కలకు బ్రేక్ పడింది. లోక్‌సభలో శుక్రవారం ప్రవేశపెట్టిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోయింది. దీంతో మహిళా బిల్లుతో సహా మరో బిల్లును కేంద్రం ఉపసంహరించుకుంది. 2/3 వంతు మద్దతును ఎన్డీయే ప్రభుత్వం కూడగట్టలేకపోయింది. బయట నుంచి చూస్తే ఇది బీజేపీకి ఘోర పరాజయంగా కనిపించవచ్చు, కానీ రాజకీయంగా ఇది బీజేపీకి విజయమే అని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ మొత్తం ఎపిసోడ్‌లో "ఓడిపోయి బీజేపీ గెలిచింది. గెలిచి కాంగ్రెస్ ఓడిపోయింది" అని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. లోక్‌సభలో బిల్లుకు వ్యతిరేకంగా ఓట్లు పడిన తర్వాత, కేంద్ర మంత్రి కిరెన్ రిజిజు మాట్లాడుతూ.. ఒక చారిత్రాత్మక బిల్లును ప్రతిపక్షాలు అడ్డుకున్నాయని విమర్శించారు. మహిళా బిల్లును అడ్డుకున్నారని మండిపడ్డారు. అయితే, తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. బీజేపీకి సంఖ్యా బలం లేదని ముందే తెలుసు. కానీ ప్రతిపక్షాల నుంచి మద్దతు వస్తుందని ఊహించారు. ఒక వేళ ఓడిపోతే ప్లాన్-బికి కూడా బీజేపీ సిద్ధంగా ఉంది. ఇప్పుడు గెలిచినా, ఓడినా క్రెడిట్ మొత్తం బీజేపీ ఖాతాలోకే వెళ్లినట్లయింది. "మహిళా రిజర్వేషన్లకు ప్రతిపక్షాలు, కాంగ్రెస్ వ్యతిరేకం" అని బీజేపీ ఒక రాజకీయ నినాదాన్ని సృష్టించబోతోంది. పశ్చిమబెంగాల్, తమిళనాడు ఎన్నికల ముందు ఇది ఎంతో కొంత ప్రభావం చూపించే అంశంగా మారింది. గురువారం లోక్‌సభలో ప్రధాని మోడీ మాట్లాడుతూ.. ఈ బిల్లును వ్యతిరేకించే వారిని దేశంలో మహిళలు క్షమించరని చెప్పారు. ఇక ఇప్పటి నుంచి ప్రతిపక్షాలను ముఖ్యంగా కాంగ్రెస్‌పై బీజేపీ విరుచుకుపడుతుంది. కాంగ్రెస్, ఇండీ కూటమి బిల్లుకు వ్యతిరేకమనే ఒక వాదనను ప్రజల్లోకి తీసుకెళ్తుంది. 2010లో మహిళా రిజర్వేషన్లను వ్యతిరేకించి సమాజ్‌వాదీ పార్టీ, ఆర్జేడీలు రాజకీయంగా కొంత కాలం దెబ్బతిన్నాయి. 2010లో అప్పటి మన్మోహన్ సింగ్ సర్కార్ మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును తీసుకువచ్చింది. ఎస్పీ అధినేత ములాయం సింగ్ యాదవ్, ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్‌లు వ్యతిరేకించారు. ప్రతిపక్షాలు బీజేపీ ప్రవేశపెడుతున్న బిల్లులు రాజ్యాంగ వ్యతిరేకమని, దేశ రాజకీయ స్వరూపాన్ని మార్చే కుట్ర అని రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ వాదిస్తున్నారు. వీటన్నింటిని పక్కన పెట్టి బీజేపీ మాత్రం కాంగ్రెస్ మహిళా వ్యతిరేకమనే నేరెటివ్‌ను తయారు చేస్తుంది.

# బ్యాలెట్ బాక్సుల్లో భవితవ్యం!




ప్రజాస్వామ్య భారత్‌లో ఎన్నికలు అంటే కేవలం ఓట్లు వేయడం మాత్రమే కాదు. ఆ ఓటు ఫలితం ఏంటో తెలుసుకోవాలని ఉత్సుకత ప్రతి ఒక్కరిలో ఉంటుంది. ఎన్నికల ఫలితాలు వెలువడటానికి ముందే ప్రజల నాడిని పట్టుకోవాలని ప్రయత్నించే చర్య సర్వేలు. ప్రస్తుతం 2026లో ఐదు రాష్ట్రాల్లో జరిగిన పోలింగ్ ప్రక్రియ ముగిసింది. ఇప్పుడు ఎగ్జిట్ పోల్స్ కూడా వచ్చాయి. అయితే ఈ సర్వేలు ఎలా చేస్తారు. వీటికి ఉండే చట్టబద్ధత ఏంటీ అనే విషయాలను లోతుగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. ఒపీనియర్ పోల్ లేదా అభిప్రాయ సేకరణ అనేది ఎన్నికలు ప్రారంభంకావడానికి ముందే నిర్వహించే సర్వే. నామినేషన్ల ప్రక్రియకు ముందు లేదా ప్రచారం జరుగుతున్న సమయంలో వీటిని చేపడతారు. ఓటర్లు ఏ పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారు, వారి ప్రధాన సమస్యలు ఏంటీ, ప్రచార పద్ధతులు ఓటర్లను ఎంత వరకు ప్రభావితం చేస్తున్నాయి అనేది తెలుసుకోవడానికి సర్వేలు చేస్తారు. శాంపిల్ సైజ్ నుంచి సమాచారాన్ని సేకరిస్తారు. ఎన్నికల ప్రచారం సాగుతున్న కొద్దీ ప్రజల అభిప్రాయాలు మారే ఛాన్స్ ఉంది. అందుకే ఒపీనియన్ పోల్ ఫలితాలు ఎప్పుడూ ఒకేలా ఉండవు. ఎగ్జిట్ పోల్ అనేది ఓటు వేసిన తర్వాత బయటకు వచ్చిన ఓటరు అభిప్రాయాన్ని నేరుగా సేకరించే ప్రక్రియ. ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకున్న వెంటనే పోలింగ్ కేంద్రం వెలుపల ఈ సర్వే చేస్తారు. సర్వే చేసే వ్యక్తులు పోలింగ్ బూత్ బయట వేచి ఉండి, ఓటు వేసి వస్తున్న వారిని మీరు ఎవరికి ఓటు వేశారు అని అడిగి తెలుసుకుంటారు. ఓటరు తన నిర్ణయాన్ని అమలు చేసిన తర్వాత చెప్పే మాటలు కాబట్టి ఇవి ఒపీనియన్ పోల్స్ కంటే కాస్త కచ్చితత్వానికి దగ్గరగా ఉంటాయని భావిస్తున్నారు. అయితే ఇవి కేవలం ప్రాథమిక అంచనాలు మాత్రమే. అధికారిక ఫలితాలు కావు. ఎన్నికల ప్రక్రియ నిష్పక్షపాతంగా జరగడానికి కేంద్ర ఎన్నికల సంఘం కొన్ని రూల్స్ ఫ్రేమ్ చేసింది. ముఖ్యంగా ఎగ్జిట్ పోల్స్ ప్రసారంపై ఆంక్షలు విధించింది. ఎన్నికలు ఒకటి కంటే ఎక్కువ దశల్లో జరుగుతున్నప్పుడు అన్ని దశల పోలింగ్ పూర్తి అయ్యే వరకు ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు వెల్లడించకూడదు. ఇవాళ కూడా దీన్ని అమలు చేసింది. ఉదయం ఏడు గంటలకు పోలింగ్ ప్రారంభమై ఆరు గంటలకు ముగిసింది. ఎగ్జిట్ పోల్ ఫలితాలు ఆరున్న తర్వాత వెల్లడించారు. ఈ రూల్స్ అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటారు. రెండేళ్ల జైలు శిక్ష, జరిమానా లేదా రెండూ ఉంటాయి. మీడియా సంస్థలు, పరిశోధన ఏజెన్సీలు, పోలింగ్ సంస్థలు వివిధ పద్ధతుల ద్వారా డేటాను సేకరిస్తాయి. క్షేత్రస్థాయిలో ఓటర్లతో మాట్లాడటం ద్వారా, టెలిఫోన్ ద్వారా ఓటర్ల అభిప్రాయం తెలుసుకుంటాయి. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో టీంలను పంపించి సమాచారాన్ని సేకరిస్తారు. మరో వైపు తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో దాదాపు అన్ని సర్వేలు డీఎంకే కూటమిదే మళ్లీ అధికారమని అంచనా వేశాయి. కానీ, ఒక్క సంస్థ మాత్రం దళపతి విజయ్ పార్టీ టీవీకే మెజార్టీ స్థానాల్లో గెలిచి, అధికారం చేపడుతుందని తెలిపింది. యాక్సిస్ మై ఇండియా సర్వే విజయ్ పార్టీ సునామీ తథ్యమని జోస్యం చెప్పింది. ఆ సంస్థ అంచనా ప్రకారం టీవీకే 98 నుంచి 120 స్థానాలు, డీఎంకే కూటమి 92 నుంచి 110, అన్నాడీఎంకే కూటమి 22 నుంచి 30 సీట్లలో గెలుస్తుందని పేర్కొంది. మొత్తం 234 స్థానాలున్న తమిళనాడులో అధికారం చేపట్టడానికి మ్యాజిక్ ఫిగర్ 118 స్థానాలు. ఆ సర్వే అంచనా నిజమైతే విజయ్ ముఖ్యమంత్రి అవుతారు. అయితే, తుది ఫలితాలు అంచనాలకు దగ్గరగా ఉంటాయా? లేదా? అనేది మే 4న తేలిపోనుంది. అంతేకాదు, అంచనాలు తారుమారై డీఎంకే కూటమి మెజార్టీ మార్క్‌కు దగ్గరగా ఆగిపోతే విజయ్ మద్దతు కీలకమవుతుంది. రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. అయితే, గతంలో పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, పార్లమెంట్ ఎన్నికల్లో యాక్సిస్ మై ఇండియా సర్వేలు నిజమయ్యాయి. గతంలో ఐదు సందర్భాల్లో మిగతా సంస్థలకు భిన్నంగా దీని అంచనాలు, ఫలితాలకు దగ్గరగా ఉన్నాయి. 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ నాయకత్వంలోని ఎన్డీయే కూటమికి 359 సీట్లు వస్తాయని అంచనా వేసింది. ఈ అంచనాలకు అనుగుణంగా ఫలితాలు వచ్చాయి. 2024లో మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు, గతేడాది ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు, అంతకు ముందు మధ్యప్రదేశ్ శాసనసభ ఎన్నికల సమయంలోనూ ఖచ్చితంగా అంచనా వేసింది. మధ్యప్రదేశ్‌లో అన్ని సర్వేలూ కాంగ్రెస్ గెలుస్తుందని చెబితే.. యాక్సిస్ మై ఇండియా మాత్రం 140- 162 సీట్లు వస్తాయని జోస్యం చెప్పింది. అన్నట్టుగానే బీజేపీ 163 సీట్లతో మళ్లీ అధికారం నిలబెట్టుకుంది. ఎగ్జిట్ పోల్స్ ఎప్పుడూ ఓట్ల లెక్కింపు రోజున వాస్తవ ఫలితాలుగా మారనప్పటికీ, అవి ప్రజా చర్చను ప్రభావితం చేస్తూ, తుది తీర్పుపై ఉత్కంఠను పెంచుతాయి. ఇక బెంగాల్ విషయానికి వస్తే పీపుల్స్ పల్స్ సర్వే టీఎంసీకి 177 నుంచి 187, బీజేపీకి 95-110 స్థానాలు వస్తాయని అంచనా వేసింది. మ్యాట్రిజ్ సర్వే టీఎంసీ 125 నుంచి 140, బీజేపీ 146-161 చోట్ల విజయం సాధిస్తుందని పేర్కొంది. అయితే, పీ-మార్క్ సర్వే మాత్రం టీఎంసీ 118-138, బీజేపీ 150-175 స్థానాల్లో గెలిచే అవకాశం ఉందని పేర్కొంది. చాణక్య స్ట్రాటజీస్ కూడా బీజేపీకి ఛాన్స్ ఉందని వెల్లడించింది. బీజేపీకి 150-160 స్థానాలు, తృణమూల్ కాంగ్రెస్‌కు 130-140 స్థానాలు వచ్చే ఛాన్స్ ఉందని తెలిపింది. పోల్ డెయిరీ కూడా కమలం వికసిస్తుందని అంచనా వేసింది. టీఎంసీకి 99 నుంచి 127, బీజేపీకి 142 నుంచి 171, కాంగ్రెస్ 3 నుంచి 5 స్థానాల్లో విజయం సాధిస్తాయని చెప్పింది. జన్మత్ 195 నుంచి 205 స్థానాలు టీఎంసీకి, 80 నుంచి 90 స్థానాలు బీజేపీకి వస్తాయని అంచనా వేసింది. అలాగే, ఎన్డీటీవీ అంచనాలు కూడా టీఎంసీ 146, బీజేపీ 140, ఇతరులు 6 చోట్ల విజయం సాధించే అవకాశం ఉన్నాయని తెలిపాయి. మరి ఈసారి కూడా ఈ సంస్థ అంచనాలు నిజమవుతాయా? అనేది మే 4న తెలుస్తుంది. తమిళనాడు ఎన్నికల్లో తొలిసారి పోటీచేసిన విజయ్.. ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోలేదు. ఈ సర్వే అంచనా వేసినట్టు ఫలితాలు ఉంటే.. విజయ్ చరిత్రను తిరగరాయనున్నారు. ఇప్పుడు ఎగ్జిట్ పోల్స్ ఇస్తున్న సంస్థలు పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ, అస్సాం, పుదుచ్చేరిలో ఓటింగ్ సరళిని అంచనా వేయడానికి ఈ పద్ధతులను అనుసరించాయి. ఎగ్జిట్ పోల్స్ అనేవి కేవలం సంకేతాలు మాత్రమే ఇవి ఎప్పుడూ కచ్చితంగా ఉంటాయని చెప్పలేం. అనేక సందర్భాల్లో ఎగ్జిట్‌పోల్ అంచనాలు లెక్క తప్పుతుంటాయి. ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్రాల్లో ఒకట్రెండు మినహా మిగతా సర్వే సంస్థల లెక్కలు తెప్పాయి.

# సర్కారీ మెట్రో...




హైదరాబాద్: హైదరాబాద్ మహానగర ముఖ చిత్రాన్ని మార్చేసిన లక్షలాది మందికి చేరువైన హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టులో ఒక కీలక అధ్యాయం ముగిసింది. ఇన్నాళ్లు ప్రభుత్వం, ప్రైవేటు భాగస్వామ్యం కింద లార్సన్ అండ్ టూబ్రో(ఎల్ అండ్ టీ) నిర్వహణలో ఉన్న మెట్రో మొదటి దశ, ఇప్పుడు పూర్తిగా తెలంగాణ ప్రభుత్వ వశమైంది. దాదాపు 15 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణం తర్వాత ఎల్ అండ్ టీ ఈ ప్రాజెక్టు నుంచి తప్పుకోగా మెట్రో పగ్గాలను ప్రభుత్వం తన చేతుల్లోకి తీసుకుంది. హైదరాబాద్ మెట్రో రైలు మొదటి దశను హైదరాబాద్ మెట్రో రైలు లిమిటెడ్ ద్వారా స్వాధీనం చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కార్యరూపం దాల్చింది.. ఎల్ అండ్ టీ మెట్రో రైలు లిమిటెడ్‌లో ఉన్న మొత్తం వంద శాతం ఈక్విటీని 1, 461.47 కోట్లకుప్రభుత్వం కొనుగోలు చేసింది. ఈ ఒప్పంద పత్రాలపై హెచ్‌ఎంఆర్‌ఎల్ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, ఎల్ అండ్ టీ ప్రతినిధి డీకే సేన్, ఎల్ అండ్ టీమెట్రో ఎండీ కేవీబీ రెడ్డి సంతకాలు చేశారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే. రామకృష్ణరావు, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, మెట్రో మాజీ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి సాక్షులుగా ఉన్నారు అంతకు ముందు ఎల్ అండ్ టీ ఛైర్మన్ ఎస్ ఎన్ సుబ్రహ్మణ్యన్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో భేటీ అయ్యారు. ఈప్రక్రియపై చర్చించారు. మెట్రోను స్వాధీనం చేసుకోవడంలో కేవలం వాటాలను కొనుగోలు మాత్రమే కాకుండా భారీ ఆర్థిక బాధ్యతలను కూడా ప్రభుత్వం స్వీకరించింది. ఏప్రిల్ 30, 2026 నాటికి ఎల్ అండ్ టీ మెట్రోపై ఉన్న 13, 538.53 కోట్ల అప్పును ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం హామీతో రీఫైనాన్స్ చేయనున్నారు. ఈ లావాదేవీ పూర్తి అయిన తర్వాత ఎల్ అండ్‌టీ ఈ మెట్రో ప్రాజెక్టుతో ఎటువంటి అనుబంధం ఉండదు. ఈ ప్రక్రియ జూన్ 30 నాటికి పూర్తి కావచ్చని అంచనా. ఈ భారీ లావాదేవీకి ఐడీబీఐ క్యాపిటల్ టాన్సాక్షన్ అడ్వైజర్‌గా, సరఫ్ అండ్ పార్టనర్స్ లీగల్ అడ్వైజరీగా వ్యవహరించాయి. హైదరాబాద్ మెట్రో ప్రయాణం 2010లో ప్రారంభమైంది. మొదట మేటాస్ కన్సార్షియంఈ టెండర్ పొందినా, సత్యం కుంభకోణం తర్వాత అది రద్దు అయ్యింది. 2010లో జరిగిన రెండో టెండర్లలో ఎల్ అండ్ టీ అత్యంత తక్కువకోట్ చేసి ప్రాజెక్టును దక్కించుకుంది. అప్పట్లో ఇది ప్రపంచంలోనే అతి పెద్ద పీపీపీ ప్రాజెక్టుగా గుర్తింపు పొందింది. 71 కిలోమీటర్లమేర ప్రాజెక్టు అంచనా వ్యయం మొదట 12, 132 కోట్లు కాగా, పూర్తి అయ్యే సరికి ఇది పెరిగింది. బ్యాంకులనుంచి 11,478 కోట్ల రుణం, ఎల్ అండ్ టీ వాటా 3,440 కోట్లుగా ఉంది. మొదటి దశ 2017నవంబర్ 29నప్రయాణికులకు అందుబాటులోకి వచ్చింది. ప్రస్తుతం 69.2 కిలోమీటర్ల మేర మూడు కారిడార్లలో సేవలు అందుతున్నాయి.

**ప్రభుత్వ స్వాధీన నిర్ణయానికి కారణాలు ఇవే:** ఎల్ అండ్ టీ ఈ ప్రాజెక్టు నుంచి వైదొలగడానికి, ప్రభుత్వం దీనిని స్వీకరించడానికి బలమైన కారణాలు ఉన్నాయి. కోవిడ్ సమయంలో ఆరు నెలలపాటు మెట్రో నిలిచిపోవడంతో ప్రాజెక్టు తీవ్ర నష్టాల్లో కూరుకుపోయింది. ప్రభుత్వం అప్పట్లో900 కోట్లవడ్డీ లేనిరుణాన్ని కూడా ఇచ్చింది. మొదట 35 ఏళ్ల ఒప్పందం ఉండగా, దానిని2072 వరకు అంటే మరో పాతికేళ్లు పొడిగించారు. అయితే ఆర్థిక ఒత్తిడి కారణంగా ఎల్ అండ్ టీ తప్పుకోవాలని భావించింది. మొదటి దశ ప్రైవేటు వద్ద, రెండో దశ ప్రభుత్వం వద్ద ఉంటే నిర్వహణలో ఇబ్బందులు వస్తాయని ప్రభుత్వం భావించింది. ఇప్పుడు రెండు దశలూ ప్రభుత్వ పర్యవేక్షణలోనే ఉండటం వల్ల సమగ్ర రవాణా వ్యవస్థను నిర్మించడం సులభమవుతుంది. ప్రస్తుతం హైదరాబాద్ మెట్రోలో నిత్యం సగటున 4.50 లక్షల మంది ప్రయాణిస్తున్నారు. ఇప్పటి వరకు 86 కోట్ల ప్రయాణాలు నమోదు అయ్యాయి. మెట్రో ప్రభుత్వపరమవ్వడం వల్ల భవిష్యత్‌లో కొత్త మెట్రో లైన్ల నిర్మాణం పాత కారిడార్ల అనుసంధానం వేగవంతం అవుతుంది. ప్రయాణికుల అవసరాలు అనుగుణంగా ఛార్జీలు, సమయపాలన, ఇతర సదుపాయాలపై ప్రభుత్వం పూర్తి నిర్ణయాధికారం కలిగి ఉంటుంది. సీఎం రేవంత్ రెడ్డి కలల ప్రాజెక్టు అయిన ఫ్యూచర్ సిటీకి మెట్రోను అనుసంధానించే ప్రక్రియ మరింత సులభతరం చేయవచ్చు.

# రైతు సమాచారంలో ఆశించిన స్థాయికి చేరని డిజిటల్ సేవలు..!



పంట ఉత్పాదకత పెరగడంలో, సాగు నిర్ణయాల్లో, స్థిరమైన వ్యవసాయ విధానాల అమలులో వ్యవసాయ సమాచారం కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, పాడి రైతులు ఇప్పటికీ ఎక్కువగా సాంప్రదాయ సమాచార వనరులపై ఆధారపడుతున్నారు. ఇటీవల తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జరిగిన ఒక అధ్యయనంలో పలు ఆసక్తికర అంశాలు వెల్లడయ్యాయి. వరి ఎగుమతి ప్రాంతాల్లో నిర్వహించిన పరిశోధనలో ఈ అంశాలువెలుగులోకి వచ్చాయి. వాతావరణ మార్పు లు, పురుగు నియంత్రణ, ఎరువుల వినియోగం, నీటి నిర్వహణ, మార్కెట్ ధరల వంటి కీలక విషయాల్లో రైతులు కుటుంబ సభ్యులు, స్నేహితులు, ఇరుగు పొరుగువారు వంటి వ్యక్తిగత వనరులపై ఎక్కువగా ఆధారపడుతున్నట్లు తేలింది. శాస్త్రీయ వ్యవసాయ సమాచార వనరులు, డిజిటల్ ప్లాట్‌ఫార్మ్‌ల వినియోగం ఇంకా ఆశించిన స్థాయికి చేరలేదని అధ్యయనం స్పష్టం చేసింది.

**కుటుంబమే ప్రధాన సమాచారం వనరు..:** తెలంగాణలో 65 శాతం, ఆంధ్రప్రదేశ్‌లో 68.75 శాతం రైతులు కుటుంబ సభ్యులు, స్నేహి తుల నుంచే వ్యవసాయ సమాచారాన్ని ఎక్కువగా పొందుతున్నట్లు తేలింది. పొరుగువారి నుంచి సమాచారం పొందే శాతం కూడా గణనీయంగా ఉంది. అయితే ఈ విధానం వల్ల ఆధునిక "గుడ్ అగ్రికల్చరల్ ప్రాక్టీసెస్ (GAP)" గురించి అవగాహన తగ్గే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. గ్రామీణ సహకార వ్యవస్థ బలంగా ఉన్నప్పటికీ, సమాచారం తరతరాలుగా పరిమిత వర్గాల్లోనే కొనసాగుతుందని అధ్యయనం పేర్కొంది.

**ప్రభుత్వ వ్యవసాయ అధికారులపై అధిక విశ్వాసం..:** సాంప్రదాయేతర వర్గాల్లో రాష్ట్ర వ్యవసాయ శాఖ అధికారులపై రైతుల విశ్వాసం అత్యధికంగాఉన్నట్లుతేలింది. తెలంగాణలో 71.25శాతం, ఆంధ్రప్రదేశ్‌లో 73.75శాతం రైతులు వీరి ద్వారా సమాచారం పొందుతున్నారు. తెలంగాణలో రైతు వేదికల ద్వారా, ఆంధ్రప్రదేశ్‌లో రైతు భరోసా కేంద్రాల (RBKs) ద్వారా వ్యవసాయ సలహాలు చేరుతున్నప్పటికీ, కొన్ని గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా పూర్తి స్థాయి చేరిక లేనట్లు గుర్తించారు. శాస్త్రవేత్తలు, ICAR సంస్థలతో రైతుల ప్రత్యక్ష సంబంధం తక్కువగా ఉండడం కూడా ఒక ప్రధాన లోటుగా పరిశోధన పేర్కొంది. ఎన్జీవోల పాత్ర కూడా పరిమితంగానే ఉంది.

**మీడియా వినియోగంలో మార్పులు.. మొబైల్ పై ఆసక్తి... :**
మాస్ మీడియా వర్గంలో కిసాన్ మేళాలు, వ్యవసాయ ప్రదర్శనలు రైతులకు ప్రధాన సమాచార వేదికలుగా నిలుస్తున్నాయి. ప్రత్యక్షంగా నేర్చుకునే అవకాశం ఉండటంతో రైతులు వీటికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. న్యూస్‌పేపర్లు మోస్తరు స్థాయిలో వినియోగంలో ఉండగా, మొబైల్/ఇంటర్నెట్ ఆధారిత సేవలు పెరుగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఈ డిజిటల్ వినియోగం కొంత ఎక్కువగా కనిపిస్తోంది.
టీవీ వినియో గం పరిమితంగాఉండగా, రేడియోపూర్తిగా దాదాపు వినియోగంలో లేకపో వడం గమనార్హం. ఇది సమాచార వినియోగంలో డిజిటల్ మరియు విజువల్ మీడియావైపు రైతులుమళ్లుతున్నసంకేతంగా కనబడుతోంది.

**మొత్తం వినియోగ ధోరణి..:** అధ్యయనంలో పాల్గొన్న రైతుల్లో ఎక్కువ మంది (సుమారు61.88శాతం) మధ్యస్థస్థాయి సమాచార వినియోగాన్ని చూపినట్లు తేలింది. తక్కువ స్థాయి వినియోగం 21.87 శాతం ఉండగా, అధిక స్థాయి వినియోగం 16.25 శాతంగా నమోదైంది.

**నిపుణుల అభిప్రాయం.. :**
వ్యవసాయ సమాచార వ్యవస్థలో ప్రభుత్వ విస్తరణ సేవలు కీలకంగా ఉన్నప్పటికీ, పరిశోధనా సంస్థలు--రైతుల మధ్య దూరం తగ్గించాల్సిన అవసరంఉందని నిపుణులు సూచిస్తున్నారు. డిజిటల్ సేవలు, మొబైల్ యాప్స్ మరింత విస్తృతంగా చేరితే మాత్రమే ఆధునిక వ్యవసాయ పద్ధతుల స్వీకరణ పెరుగుతుందని అభిప్రాయపడుతున్నారు. పరిశోధన ప్రకారం, రైతులు ఇప్పటికీ కుటుంబం, స్నేహితులు వంటి సాంప్రదాయ వనరులపైనే ఎక్కువగా ఆధారపడుతున్నప్పటికీ, ప్రభుత్వ వ్యవసాయ సేవలు మరియు డిజిటల్ ప్లాట్‌ఫార్మ్‌ల వైపు నెమ్మదిగా మార్పు కనిపిస్తోంది. అయితే ఈ మార్పు వేగం ఇంకా పెరగాల్సిన అవసరం ఉందని అధ్యయనం స్పష్టం చేసింది.

# జూన్‌లో పంచాయితీ పోల్స్‌కు ఏర్పాట్లు..?!



**విజయవాడ,తెలంగాణ దిశ :**ఆంధ్రప్రదేశ్‌లో సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు కూటమి ప్రభుత్వం సిద్ధమవుతోంది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 13,100 గ్రామ పంచాయతీల్లో స ర్పంచులు, వార్డు సభ్యుల పదవీకాలం ముగియడంతో పాలన మొత్తం ప్రత్యేక అధికారుల చేతుల్లోకి వెళ్ళింది. ప్రభుత్వం ఈవేసవిలోనే ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని భావిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో పంచాయతీ రాజ్ వ్యవస్థ మళ్ళీ పట్టాలెక్కే సమయం ఆసన్నమైంది. రాష్ట్రంలో గ్రామ పంచాయతీల పాలకవర్గాల పదవీకాలం ముగియడ ంతో, క్షేత్రస్థాయిలో పాలన స్తంభించకుండా ప్రభుత్వం ప్రత్యేక అధికా రులను నియమించిం ది. అయితే, గతంలో ఎదురైన చేదు అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, ఈసారి సుదీర్ఘకాలం అధికారుల పాలనను కొనసాగించకూడదని ము ఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృఢ నిశ్చయంతో ఉన్నారు. వీలైనంత త్వరగా అంటే.. మే లేదా జూన్ నెలల్లోనే ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.సాధారణంగా ఏప్రిల్, మే నెలల్లో పాఠశాలలకు వేసవి సెలవులు ఉండటంతో, ప్రభుత్వ భవనాలు, ఉపాధ్యాయుల సేవలను ఎన్నికల విధులకు వినియోగించు కోవడం సులభతరం అవుతుంది. ఇదే తరుణంలో ఎన్నికలు నిర్వహిస్తే అటు విద్యా సంవత్సరంపై ప్రభావం ఉండదని, ఇటు వర్షాకాలం మొదల వ్వకముందే కొత్త పాలకవర్గాలు కొలువు తీరుతాయని ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల సంఘం దీనిపై ప్రాథమిక కసరత్తు ప్రారంభించినట్లు సమాచారం.వార్డుల పునర్విభజన, రిజర్వేషన్ల ప్రక్రియ అత్యంత కీలకంగా మారింది. 2024 అసెంబ్లీ ఎన్నికల నాటి భారీ విజయంతర్వాత వస్తున్న ఈ స్థానిక ఎన్నికలను కూటమి పార్టీలు ప్ర తిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి. జనసేన, బీజేపీలతో కలిసి రిజర్వేషన్ల కేటాయింపులో ఎక్కడా వివాదాలు రాకుండా సమన్వయం చేసుకోవాల్సి న అవసరం ఉంది. ఈ సాంకేతిక ప్రక్రియ మే నెలలో పూర్తి చేసి, జూన్ కల్లా పోలింగ్ నిర్వహించేలా కార్యాచరణ సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.ప్రతిపక్ష వైసీపీ కూడా ఈఎన్నికలపై గట్టి ఆశలే పెట్టుకుంది. అసెంబ్లీ ఎన్నికల ఓటమి తర్వాత తమ క్యాడర్‌లో మళ్ళీ ఉత్సాహాన్ని నింపాలంటే స్థానిక సంస్థల ఎన్నికలే సరైన వేదిక అని వైఎస్ జగన్ భావిస్తున్నారు. అయితే,అధికార పార్టీపై సానుకూలత ఉన్నసమయం లోనే ఎన్నికలకు వెళ్లడం ద్వారా మెజారిటీ స్థానాలను కైవసం చేసుకోవాలని టీడీపీ భావిస్తోంది.ఉపాధి హామీ నిధులు, గ్రామాలకు వచ్చే కేంద్ర నిధులను సక్రమంగా వినియోగించాలంటే ఎన్నికైన పాల కవర్గాలే ఉండాలన్నది కేంద్ర ప్రభుత్వ నిబంధన కూడా దీనికి ప్రధాన కారణం. వేసవి సెలవుల లోపు నోటిఫికేషన్ విడుదల కాకపోతే, జూ లైలో వర్షాలు ప్రారంభమయ్యే అవకాశం ఉన్నందున ప్రక్రియ మరింత ఆలస్యమయ్యే ప్రమాదం ఉంది. అందుకే, సెక్షన్ 14 కింద ఉన్న అధికారాలను ఉపయోగించి, వీలైనంత వేగంగా ఓటర్ల జాబితాల స వరణ పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

# బీజేపీని నిండా ముంచుతున్న అన్నాడీఎంకే..!?



చెన్నై,: మిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలైని పక్కన పెట్టింది. ఏఐడీఎంకే చెప్పినట్టుగా సీట్లకు ఒప్పుకొంది. అన్ని విధాలుగా.. అన్ని అంశాలలో రాజీ పడింది. వాస్తవానికి కేంద్రంలో అధికారంలో ఉన్న ప్పటికీ.. బిజెపికి తమిళనాడులో ఏమి చేయలేని పరిస్థితి. అందువల్లే ఏఐడీఎంకే ఆడించినట్టు ఆడింది. ఇంతచేసినప్పటికీ ఏమైనా ఉపయోగం ఉందా అంటే.. అది పలుచూపుమేరలో కూడా కనిపించడం లేదు.ఎగ్జిట్ పోల్స్‌లో ఏ సంస్థ కూడా ఏఐటీఎంకే అధికారాన్ని దక్కించుకుంటుందని ప్రకటించలేదు.. పీపుల్ పల్స్ నుంచి మొదలు పెడితే చాణక్య స్ట్రాటజీస్ వరకు ప్రతి సంస్థ కూడా తమిళనాడు రాష్ట్రంలో డీఎంకే అధికారంలోకి వస్తుందని ప్రకటించాయి. ఇక్కడ ద్రావిడ సెంటిమెంట్ ముందు జాతీయవాదం పనిచేయదని నిరూపించాయి. తమిళనాడు రాష్ట్రంలో 180ప్లస్ సీట్లతో డిఎంకె కూటమి విజయం సాధిస్తుందని స్మార్ట్ పోల్ సంస్థ ప్రకటించింది. ఇందులో ఏ ఐ డి ఎం కే కూటమికి కేవలం 28 సీట్లు మాత్రమే వస్తాయని ప్రకటించింది. ఓటు షేర్ విషయంలో కూ డా కేవలం 27.6 చేత మాత్రమే లభిస్తుందని స్పష్టం చేసింది. మాట్రిజ్ సంస్థ భిన్నమైన ఫలితాన్ని చెప్పినప్పటికీ.. ఈ సంస్థకు అంత గొప్పగా క్రెడిబుల్టి లేదు. ఈ సంస్థ ఏఐడీఎంకే కూటమికి 87 నుంచి 110 సీట్లు వస్తాయని ప్రకటించింది.యాక్సిస్ మై ఇండియా సంస్థ ఏఐడీఎం కే కూటమికి 22 నుంచి 32 స్థానాలకు వస్తాయని వెల్లడిం చింది.. చాణక్య స్ట్రాటజీస్ కూడా ఏఐడీఎంకేకు తమిళనాడులో అధికారం రాదని స్పష్టం చేసింది. ఈ కూటమికి కేవలం 50 నుంచి 65 స్థానాలు మాత్రమే వస్తాయని వెల్లడించింది. వాస్తవానికి బిజెపి అధినాయకత్వం తమిళనాడు విషయంలో అంతగా చొరవ చూపలేదని తెలుస్తోంది. వెస్ట్ బెంగాల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రముఖంగా ప్రచారం చేశారు. అక్కడి ఓటర్లను ప్రభావితం చేయడానికి ఎన్నో రకాలుగా ప్రయత్నాలు చేశారు. కానీ అదే దూకుడు తమిళనాడులో కొనసాగించలే కపోయారు. పైగాబిజెపిరాష్ట్ర నేతలు ఇక్కడ తలా ఒక దిక్కుగా మారిపో యారు.అన్నామలై మాటకు విలువ లేకపోవడంతో ఆయన ఎన్నికల్లో టచ్‌మీనాట్ అన్నట్టుగా వ్యవహరించారు. కొత్తఅధ్యక్షుడు లేకి వ్యాఖ్యలు చేసి.. తమిళ హీరో విజయ్ కి క్షమాపణలు చెప్పారు. ఇక ఏఐడీఎంకే నేతలు కూడా ఇష్టానుసారంగా సీట్ల కేటాయింపు జరిపారు. అత్యంత కఠినమైన సీట్లను బిజెపికి ఇచ్చారు. ఈ విషయాన్ని బిజెపి అధినాయక త్వంతోస్థానిక నాయకులు చెప్పినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయిం ది. ఫలితంగా తమిళనాడు ఎన్నికల్లో ఏఐడీఎం కే కూటమి మరోసారి విఫల బృందంగా మారిపోయే పరిస్థితి కనిపిస్తోంది.

# కరీంనగర్ లో కయ్యాల కాంగ్రెస్..?

**కరీంనగర్,తెలంగాణ దిశ :** కాంగ్రెస్ అంటేనే కయ్యాల పార్టీ. తెలుగు రాష్ట్రాల్లో అయితే మరీఎక్కువ. ఒకనేత ఎదుగుదలను మరో నేత ఓర్వలేడు.ఒకరి ఆధిప త్యాన్నిమరోకరు సహించరు. ఎవరికి వారుగ్రూపులుగాఉంటారు. అవస రమైతేఅధిష్టానాన్ని కూడా బూతులు తిడతారు. తర్వాతకలిసే ఉంటా రు. ఏమన్నా అంటే స్వేచ్ఛ,స్వాతంత్ర్యం అని పెద్దపెద్ద మాటలు చెబుతా రు. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన హస్తం పార్టీలో కొన్నాళ్లు క య్యాలు కనిపించలేదు. కానీ ఆరు నెలలుగా లుకలుకలు బయటపడు తున్నాయి. తాజాగా కరీనంగర్‌లో బిభేదాలు రచ్చకెక్కాయి. కరీంనగర్ కాంగ్రెస్‌లో ఇన్‌చార్జి నియామకం వివాదం పార్టీ ఐక్యతను దెబ్బతీసింది. స్థానిక నేతల అసంతృప్తి, అధిష్ఠాన నిర్ణయాలపై బహిరంగ తిరస్కారం శ్రేణుల్లో గందరగోళాన్ని మురికి చేస్తోంది.వెలిచాల్ రాజేందర్ రావును కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించడం పలువురు స్థానిక నాయకుల అభ్యంతరానికి దారితీసింది. సర్పంచులు, మాజీ కార్పొరేటర్లు తమ పేర్లతో వినతిపత్రాలు సమర్పించారని, తమ సమ్మతి లేకుండానే జరిగిందని మండిపడ్డారు. సన్నాహక సమావేశాల్లోనే విభేదా లు బహిర్గతమై, గొడవల వరకు వెళ్లింది.మాజీ నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్‌లాంటి మునుపటి నాయకులు పార్టీ నాయకత్వంపై ఫైర్ అవుతున్నారు. మంత్రిపొన్నం ప్రభాకర్,పార్లమెంట్ ఇన్‌చార్జి వెలిచాల్ రాజేందర్ రావును లక్ష్యంగా విమర్శలు చేస్తున్నారు. ఎన్నికల్లో సహకారం లేకపోవడం, టికెట్ కేటాయింపుల్లో భేదం వంటి ఆరోపణలు ఉన్నాయి. డీసీసీ కార్యాలయంలో రహస్య సమావేశాల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. కరీంనగర్ కాంగ్రెస్‌లో మూడు ముక్కలాట జరుగుతోంది. గత మున్సిపల్ మున్సిపల్ ఎన్నికల్లో 66 డివిజన్లలో కేవలం 14సీట్లకే పరి మితమైంది. ఇన్‌చార్జి లేకపోవడం, జిల్లా అధ్యక్ష పదవి ఆలస్యం ఈ సమస్యలకు ఆధారం. మంత్రివర్గ విస్తరణలో కూడా స్థానికులకు ప్రాధా న్యత లేకపోవడంపై నిరాశ వ్యక్తమవుతున్నారు. ఈవివాదం పీసీసీ స్థాయికి చేరి, సస్పెన్షన్ డిమాండ్లు ఉయరుతున్నాయి. ఎన్నికల విషయాల్లో పార్టీ బలం తగ్గుతున్న ఈ ప్రాంతంలో ఇది మరింత దెబ్బ తీస్తుంది.అధిష్టానం త్వరగా స్థానిక నేతలతో సమావేశాలు నిర్వహించి, పునర్నియామకాలు చేయాలి. పారదర్శకత, స్థానిక ప్రాతినిధ్యం పెంచితే శ్రేణులు ఏకతాటిపై నడవవచ్చు.

# అమరావతి అసలు చాలెంజ్ మొదలు!

**విజయవాడ,తెలంగాణ దిశ :**అమరావతి రాజధాని అంశంలో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలు రాష్ట్ర రాజకీయాల్లో కీలక మలుపు తీసుకువ చ్చాయి. పార్లమెంట్‌లో బిల్లు ఆమోదం పొందడంతో ఈ రాజధానికి చట్టబద్ధత లభించిందనే భావన బలపడింది. దీంతో ఇప్పటివరకు ఉన్న అనుమా నాలు,సందేహాలు చాలా వరకు తొలగిపోయాయి. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుచెప్పినట్లు అమరావతిని ఇక ఎవ్వరూ మార్చలేరనే నమ్మకం ప్రజల్లో పెరుగుతోంది. భవిష్యత్తులో ఏ ప్రభు త్వంవచ్చినాఈ నిర్ణయాన్ని మార్చడం సులభం కాదనే అభిప్రాయం వ్యక్తమ వుతోంది. ఇప్పటి నుంచి అసలు సవాలు అభివృద్ధి దిశగా ఉంటుంది. కూటమి ప్రభుత్వం మీద భారీ బాధ్యత ఉంది. అమరావతి కోసం ఇప్పటికే వేలాది ఎకరాలు సేకరించబడ్డాయి. ఇప్పుడు ఆ భూముల్లో ప్రణాళికాబ ద్ధంగా నిర్మాణాలు చేపట్టాలి. ప్రభుత్వపరంగా సచివాల యం, అసెంబ్లీ, హైకోర్టు భవనాలతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలకు నివాస సముదా యాలు నిర్మించాల్సి ఉంది. ఇవి ప్రారంభమైతే పరిపాలన క్రమంగా అమరావతికి మారే అవకాశం ఉంటుంది.అయితే అభివృద్ధి పూర్తిగా ప్రభుత్వంతోనే సాధ్యం కాదు. ప్రైవేట్ రంగంకూడా కీలకపాత్రపోషిం చాలి. వారికి కేటాయించిన భూముల్లో వేగంగా నిర్మాణా లు జరిగితేనే నగరానికి నిజమైన రూపం వస్తుంది. వ్యాపార సంస్థలు, విద్యా సంస్థలు, పరిశ్రమలు ఏర్పడితే ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయి. ఈ విధంగా జనసంచారం పెరిగితే అమరావతి ఒక జీవంతో నిండిన నగరంగా మారుతుంది.ఒక నగరం ఎదగాలంటే ఫ్లోటింగ్ పాపులేషన్ (చాలాము ఖ్యం.ఉద్యోగాలు, వ్యాపార అవకాశాలు, విద్యా సౌకర్యాలు ఉన్నచోటే ప్రజలు చేరతారు. అందుకే పరిశ్రమలు, ఐటీ కంపెనీలు, విశ్వవిద్యాల యాలు వంటి సంస్థలను ఆకర్షించడం అవసరం.

# తెలంగాణలో భారీగా.. రిజిస్ట్రేషన్ ఛార్జీలు, స్టాంప్ డ్యూటీ




**హైదరాబాద్,తెలంగాణ దిశ:** తెలంగాణలో స్థిరాస్తి కొనుగోలు చేయాలనుకునే వారికి బ్యాడ్ న్యూస్. రాష్ట్ర ప్రభుత్వం ఖజానా నింపుకునేందుకు సిద్ధమైంది. అపార్ట్‌మెంట్ అయినా, ప్లాట్ అయినా, వ్యవసాయ భూమి అయినా.. ఇకపై మీ జేబుకు చిల్లు పడటం ఖాయంగా కనిపిస్తోంది. రాష్ట్రంలో ఆస్తుల మార్కెట్ విలువలను పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మే మొదటి వారం నుంచే అమల్లోకి రానుంది. ఈ మార్పుతో రిజిస్ట్రేషన్ ఛార్జీలు, స్టాంప్ డ్యూటీ భారం ఒక్కసారిగా పెరగనుంది.రాష్ట్ర ఆర్థిక వనరుల సమీకరణపై డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలో ఏర్పాటైన కేబినెట్ ఉపసంఘం ఇటీవల సచివాలయంలో కీలక భేటీ నిర్వహించింది. రాష్ట్ర ఆదాయ మార్గాలను పెంచుకోవడమే లక్ష్యంగా జరిగిన ఈ సమావేశంలో.. ఆస్తుల మార్కెట్ విలువల సవరణకు పచ్చజెండా ఊపారు. క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవ ధరలకు, ప్రభుత్వ రికార్డుల్లో ఉన్న ధరలకు మధ్య పొంతన లేకపోవడాన్ని గమనించిన ప్రభుత్వం, ఈ వ్యత్యాసాన్ని తగ్గించడమే లక్ష్యంగా కొత్త రేట్లను సిద్ధం చేయాలని రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖను ఆదేశించింది.ప్రభుత్వ అంచనాల ప్రకారం, ఈ విలువల సవరణ ద్వారా రిజిస్ట్రేషన్ల శాఖకు అదనంగా సుమారు రూ.2,000 కోట్ల ఆదాయం సమకూరనుంది. కేవలం ఆదాయం మాత్రమే కాకుండా, మార్కెట్ ధరలను క్రమబద్ధీకరి ంచడం ద్వారా రియల్ ఎస్టేట్ రంగంలో నల్లధనం ప్రవాహాన్ని అరికట్టవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. చాలా ప్రాంతాల్లో బహిరంగ మార్కెట్ ధరలు ఆకాశంలో ఉండగా, రిజిస్ట్రేషన్ విలువలు మాత్రం తక్కువగా ఉండటంతో ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి భారీగా గండి పడుతోంది. ఈ గ్యాప్‌ను పూడ్చడమే ఈ నిర్ణయం వెనుక ఉన్న అసలు వ్యూహంగా కనిపిస్తోంది.ఈ నిర్ణయం వల్ల మధ్యతరగతి ప్రజలు, ముఖ్యంగా సొంతింటి కోసం ఎదురుచూస్తున్న వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి రావచ్చు. పట్టణ ప్రాంతాల్లో అపార్ట్‌మెంట్ ఫ్లాట్ల ధరలు, ఓపెన్ ప్లాట్ల విలువలు గణనీయంగా పెరగనున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ భూముల విలువలను కూడా భారీగా పెంచబో తున్నారు. కమర్షియల్ ప్రాపర్టీల రిజిస్ట్రేషన్ రేట్లు కూడా చుక్కలు చూపించనున్నాయి. కేవలం ఆస్తి విలువ పెరగడమే కాకుండా, ఆ పెరిగిన విలువపై చెల్లించే స్టాంప్ డ్యూటీ, ట్రాన్స్‌ఫర్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులు అన్నీ కలిపి కొనుగోలుదారుడిపై భారాన్ని రెట్టింపు చేస్తాయి. తెలంగాణలో గతంలో 2021లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు మార్కెట్ విలువలను సవరించింది. 2023 డిసెంబర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేపడుతున్న తొలి విలువల సవరణ ఇదే కావడం గమనార్హం. నిజానికి ఏడాది క్రితమే ఈ రేట్లు పెరగాల్సి ఉన్నప్పటికీ, అప్పట్లో రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో నెలకొన్న మందగమనం కారణంగా ప్రభుత్వం వెనక్కి తగ్గింది. ఇప్పుడు మార్కెట్ మళ్లీ పుంజుకోవడంతో ఈ నిర్ణయాన్ని అమలులోకి తెస్తోంది.మే మొదటి వారం నుంచి కొత్త ధరలు అమల్లోకి వస్తాయన్న సంకేతాలతో రాష్ట్రవ్యాప్తంగా రిజిస్ట్రేషన్ కార్యాలయాలు రద్దీగా మారే అవకాశం ఉంది. పెరిగే భారం నుంచి తప్పించుకునేందుకు చాలా మంది ఏప్రిల్ నెలాఖరు లోపే తమ రిజిస్ట్రేషన్ ప్రక్రియలను పూర్తి చేసుకోవాలని భావిస్తున్నారు. స్లాట్ల బుకింగ్ కోసం జనం ఎగబడే అవకాశం ఉండటంతో రిజిస్ట్రేషన్ శాఖ కూడా అప్రమత్తమైంది.

# తెలంగాణలో భారీగా నిరుద్యోగం..!

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** ఇటీవల విడుదలైన గణాంకాల ప్రకారం తెలంగాణలో నిరుద్యోగ సమస్య ఆందోళనకరంగా మారింది. ప్రముఖ ఫైనాన్షియల్ సంస్థ బజాజ్ బ్రోకింగ్, కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన 'ఇండియన్ ఎకనామిక్ సర్వే 2025-26' ఆధారంగా ఒక నివేదికను వెల్లడించింది. దీని ప్రకారం ప్రస్తుతం తెలంగాణలో నిరుద్యోగిత రేటు 8.9 శాతానికి చేరుకొని దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది.దేశ సగటు నిరుద్యోగిత రేటు 5.2 శాతంగా ఉండగా, తెలంగాణలో అది అంతకంటే 3.7 శాతం ఎక్కువగా ఉంది. ఏపీ (8.2%), కర్ణాటక (8.0%) వంటి పొరుగు రాష్ట్రాల కంటే కూడా తెలంగాణలో నిరుద్యోగం అధికంగా నమోదైంది.2022లో బీఆర్‌ఎస్ పాలనలో తెలంగాణ నిరుద్యోగిత రేటు కేవలం 0.7 శాతంగా ఉండేదని, అప్పట్లో ఉపాధి కల్పనలో రాష్ట్రం దక్షిణ భారతదేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందని నివేదిక గుర్తు చేస్తోందిగత ప్రభుత్వ హయాంలో నెలకు సగటున 2,037 ఉద్యోగ నియామకాలు జరగగా, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో గత రెండున్నరేళ్లలో ఆ వేగం తగ్గి నెలకు సగటున 566 నియామకాలకు పరిమితమైందని గణాంకాలు చెబుతున్నాయి. ప్రభుత్వ ఉద్యోగాలే కాకుండా, ప్రైవేట్ రంగంలోనూ




ఆశించిన స్థాయిలో కొత్త అవకాశాలు రాకపోవడం, ఉన్నఉద్యోగాల్లో కోతలు నిరుద్యోగులను మరింత ఇబ్బందులకు గురిచేస్తు న్నాయి.కొత్త ఉద్యోగనోటిఫికేషన్లు ఆశించిన స్థాయిలో రాకపోవడం, జాబ్ క్యాలెండర్ అమలులో జాప్యం కారణంగానేరాష్ట్రంలో ఈ పరిస్థితు లు నెలకొన్నా యని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# మెట్రో మైలు రాళ్లు..!



**హైదరాబాద్,తెలంగాణ దిశ :**భాగ్యనగర మెట్రో రైలు ప్రయాణాల్లో సరికొత్త రికార్డును సృష్టించింది. ఈ నెల 24వ తేదీ నాటికి మెట్రో రైలు ప్రారంభమైనప్పటి నుండి మొత్తం ప్రయాణీకుల సంఖ్య 850 మిలియన్లకు (85 కోట్లు) చేరుకుంది.గత ఏడాది డిసెంబర్ 19న ఈ సంఖ్య 800 మిలియన్లుగా ఉండగా, కేవలం 126 రోజుల వ్యవధిలోనే మరో 50 మిలియన్ల (5 కోట్లు) మంది మెట్రోలో ప్రయాణించారు. ప్రస్తుతం సగటున రోజుకు 3.96లక్షల మంది మెట్రో సేవలను వినియోగించుకుంటున్నారు. గతం లో రోజువారీ సగటు ప్రయాణీకుల సంఖ్య 4.50 లక్షల వరకు ఉండేదని, అయితే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిన తర్వాత మెట్రో ప్రయాణీకుల సంఖ్య కొంత తగ్గుముఖం పట్టినట్లు ఎల్ అండ్ టీ మెట్రో వర్గాలు భావిస్తున్నాయి. దీనికి తోడు మెట్రో స్టేషన్ల వద్ద 'ఫస్ట్ అండ్ లాస్ట్ మైల్ కనెక్టివిటీ' (స్టేషన్ల వరకు చేరుకునే రవాణా సౌకర్యాలు) సరిగ్గా లేకపోవడం కూడా ఒక ప్రధాన లోపంగా కనిపిస్తోంది.ఇటీవల ఆర్టీసీ ఉద్యోగుల సమ్మె సమయంలో బస్సులు నిలిచిపోయినప్పటికీ, మెట్రోలో ఆశించిన స్థాయిలో రద్దీ పెరగకపోవడం అధికారులను ఆశ్చర్యపరిచింది. సమ్మె తొలిరోజున గరిష్టంగా 4.90 లక్షల మంది ప్రయాణించినా, ఆ సంఖ్య 5 లక్షల మార్కును దాటలేకపోయింది. మెట్రోలో ప్రయాణీకుల సంఖ్యను పెంచేందుకు సమయాల్లో మార్పులు చేయాలని ప్రయాణీకులు కోరుతున్నారు.ప్రస్తుతం ఉదయం 6 గంటలకు ప్రారంభమవుతున్న సర్వీసులను, ఉదయం 5 గంటలకే ప్రారంభించాలని ప్రయాణీకులు కోరుతున్నారు. ముఖ్యంగా సికింద్రాబాద్ వంటి రైల్వే స్టేషన్లకు వచ్చే దూరప్రాంత ప్రయాణీకులకు ఇది ఎంతో మేలు చేస్తుందని దక్షిణ మధ్య రైల్వే అధికారులు కూడా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాత్రి 11 గంటలకే నిలిచిపోతున్న సేవలను కనీసం అర్ధరాత్రి 12 గంటల వరకు పొడిగించాలని కోరుతున్నారు.ఈ సూచనలను పరిశీలించాలని మెట్రో రైలు ఎండీకి ప్రభుత్వం సూచించింది. సరైన రవాణా అనుస ంధానం, సమయాల మార్పు చేపడితే మెట్రో మరింత లాభదాయకంగా మారుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# జయమ్మ బాటలో కవితమ్మ..!

**నిజామాబాద్,తెలంగాణ దిశ :** మనసులో మాట.. అంటూ కొత్తగా తెలంగాణ రాష్ట్ర సేన(టీఆర్ఎస్) పార్టీని ప్రారంభించిన కవిత కీలక ప్రకటన చేశారు. అదే 'తెలంగాణ తల్లి'గా తాను ఉండాలని భావిస్తున్నట్టు చెప్పుకొచ్చారు. సహజంగా ఇది తమిళనాడులో మాత్రమే చెల్లింది. అక్కడ ఉమ్మడి పార్టీఅంటే ద్రవిడ పార్టీ నుంచి అన్న డీఎంకే విడిపోయినప్పుడు.. ఎం జీఆర్ ద్వారా రాజకీయాల్లోకి వచ్చిన జయలలిత(జయమ్మ) తనకంటూ ఒక సొంత కుంపటిని ఏర్పాటు చేసుకునే క్రమంలో తమిళ ప్రజలకు తల్లిగా పరిచయమయ్యారు.ఇలాగే ఆవిడ కూడా తనను తల్లిగా భావించా లని కోరుకున్నారు. తమిళనాడు ప్రజలు ఆమెను రిసీవ్ చేసుకున్నారు. దీనికి కారణం ఏంటంటే.. ఆవిడ నటిగా తమిళ ప్రజల గుండెల్లో ఉన్నారుకాబట్టి అది సాధ్యమైంది. అప్పటికే వందలాది సినిమాల్లో ఆమె నటించారు. తమిళ ప్రజలను ఆకట్టుకున్నారు. కాబట్టి ఆమెను తల్లిగా భావించారు. అది సక్సెస్ అయింది. ఇప్పటికీ జయలలిత విగ్రహాలతో ఆలయాలు కట్టిన గ్రామాలు కూడా ఉన్నాయి తమిళనాడులో. కానీ ఆ పరిస్థితి కవితకు వస్తుందా.. ఆమె కామె అనుకుంటే తల్లిగా రిసీవ్ అవుతారా.. అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. తెలంగాణ సమాజం ఒక విభిన్నమైన ఆలోచనతో ఉంటుంది. సెంటిమెంటు అంటే అది వ్యక్తిగత సెంటిమెంటు కంటే కూడా సమాజ సెంటిమెంటుకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చే ప్రజలు తెలంగాణలో ఉన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో జరిగిన ఒక ఘటనను తీసుకుంటే.. కేసీఆర్ ఆమరణ దీక్ష ప్రారంభించా




రు. ఇంతలో ఢిల్లీ నుంచి వచ్చిన సమాచారంతో ఆయన దీక్ష విరమణ చేస్తున్నట్టు ప్రకటించారు.తెలంగాణ సమాజం తిరగబడే పరిస్థితి వచ్చిం ది. ఇంక తప్పని పరిస్థితుల్లో కేసీఆర్ దీక్షను కొనసాగించారు. అటువంటి సెంటిమెంటు ఉన్న తెలంగాణలో 'నేనుఅమ్మ'ని అని పరిచయం చేసుకో వడం వరకు బాగానే ఉన్నప్పటికీ తెలంగాణ సమాజం ఏ మేరకు దీన్ని ఆహ్వానిస్తుంది అనేది ప్రశ్న. ఒక ఎంపీగా ఒక ఎమ్మెల్సీగా ఒక రాజకీయ నాయకురాలుగా ఒక జాగృతి అధ్యక్షురాలుగా చూశారే తప్ప అకస్మాత్తుగా 'నేను అమ్మ'ని అని ఆవిడ చెప్పినంత మాత్రాన తెలంగాణ సమాజం ఆ రకంగా రిసీవ్ చేసుకోవడం కష్టసాధ్యం.

# జంతు పరిరక్షణ అందరి బాధ్యత...


హక్కులు కేవలం మనిషికే కాదు జంతువులకూ ఉండాలన్న ఉద్దేశ్యంతో యూనివర్సల్ డిక్లరేషన్ ఆఫ్ అనిమల్ రైట్స్‌ని ప్రకటించారు. ఈ డిక్లరేషన్‌ని 1998లో ప్రపంచ దేశాలు ఆమోదించాయి. మానవ హక్కుల దినమైన డిసెంబర్ 10న జంతువుల హక్కుల దినంగా చేయడం ద్వారా మనుషులు, జంతువులు ఒకటేనన్న సందేశం అందరికీ అందించడమే ఈ దిన ప్రధాన లక్ష్యం. మాంసం కోసం, వినోదం కోసం మానవులు అనేక రకాలుగా జంతువుల ప్రాణాలు తీస్తున్నారు. తమ వృత్తులకు, అవసరాలకు జంతువులను ఉపయోగించు కుంటూ వాటిని హింసిస్తున్నారు. ఆవు, మేక, గేదె మొదలైన జంతువులు ఎక్కువ పాలు ఇవ్వడం కోసం రసాయనాల ఇంజెక్షన్లు ఇస్తూ వానిని హింసిస్తున్నారు. జంతు సంక్షేమానికి సంబంధించి 1960లో పార్లమెంటులో చట్టం రూపొందింది. ఈ చట్టం ప్రకారం జంతువులను ఉద్దేశ్యపూర్వకంగా గానీ, నిర్లక్ష్యంగా గానీ బంధించినా, ఇబ్బంది కలిగించినా శిక్షార్హులు అవుతారు. 1960 డిసెంబర్ 26 నుంచి ఈ చట్టం అమలులో ఉంది. భూమి మీద మనుషులతో పాటు ఎన్నో రకాల జంతువులూ ఉన్నాయి.

వాస్తవానికి మనిషి కంటే ముందే జంతువులు భూమి మీద జీవించాయని సైన్స్ చెబుతోంది. జీవం నుండి జీవం రావడం మాత్రమే కాదు. ఒక జీవ జాతి అదే జీవ జాతి నుండి మాత్రమే ఉత్పన్నం అవుతుంది. అయితే భూమి ఆవిర్భవించిన తరవాత పుట్టిన చాలా జంతు జాతులు ఇప్పుడు లేవు. ఈ ఆధునిక యుగంలోనూ మనకు తెలిసిన ఎన్నో జంతు జాతులు కనుమరుగై పోతున్నాయి. మానవ మనుగడకు అనివార్యమైన జంతు సంపదను పరిరక్షించడం, వృద్ధి చేయడం, ప్రధానంగా జంతువుల హక్కులను కాపాడటం ఈ దినోత్సవ ప్రధాన లక్ష్యం. మానవుడికి, జంతువులకు మధ్య ఉన్న అవినాభావ సంబంధాన్ని ఈ దినోత్సవం తెలియజేస్తుంది. భారత దేశంలో పశ్చిమ కనుమలు, నల్లమల కొండలు, శేషాచలం కొండలు, హిమాలయాలు, దేశ ఈశాన్యప్రాంతం విభిన్న జంతు జీవ జాలానికి నిలయంగా ఉన్నాయి. దేశంలో అడవులు అన్యాక్రాంత మవుతున్నాయి. ఒకప్పుడు విశాలంగా ఎక్కడ చూసినా పచ్చదనంతో బాసిల్లే అటవీ ప్రాంతాలు రాను రాను కనుమరుగై పోతున్నాయి. వన్యప్రాణి సంరక్షణ చట్టానికి తూట్లు పొడుస్తూ అటవీ ప్రాణుల వేట యధేచ్ఛగా జరుగుతుంది. వాస్తవానికి మనం జంతువుల ఆవాసాలను నాశనం చేస్తున్నాం. విచక్షణా రహితంగా అడవులు నరుకుతూ వాటి తావులను, మంచినీటి వనరులను ధ్వంసం చేస్తున్నాం. అందుకే అడవి జంతువులు గ్రామాల్లోకీ, పట్టణాల్లోకి వస్తున్నాయి. ఆహారం కోసం మనుషులపై దాడులు చేస్తున్నాయి. ఇలాంటి పరిస్థితిని మార్చడం కూడా ఈ జంతు దినోత్సవం లక్ష్యాల్లో ఒకటి.



జంతువులకు సహజ సిద్ధమైన ఆవాసాలను కల్పించడం, జంతు జాతులను రక్షించడం, వాటి సంక్షేమాన్ని కాపాడటం ఇవే ప్రధానం. జంతు సంరక్షణ కోసం మన ప్రభుత్వాలు ఏటా కోట్ల రూపాయలను ఖర్చు చేస్తున్నాయి. అయితే స్మగ్లర్లు, వేటగాళ్లు.. వన్యప్రాణులు, అరణ్యాల పాలిట శాపంలా తయారయ్యారు. వీళ్ల దెబ్బకు కీకరారణ్యాలు సైతం మైదానాలుగా మారుతున్న పరిస్థితి. పరిశ్రమల స్థాపన పేరిట పెద్ద ఎత్తున అటవీ భూముల్లో పారిశ్రామిక కార్యకలాపాలు నిర్వహిస్తుండటం కూడా వన్యప్రాణుల మనుగడుకు ముప్పుగా మారింది. దీంతో గూడు చెదిరిన వన్యప్రాణుల జనారణ్యం లోకి వస్తున్న పరిస్థితి. దేశంలోని జంతు సంపదను పరిరక్షించడానికి మొట్టమొదటి సారిగా 1898లో ఆనాటి బ్రిటీష్ ప్రభుత్వం మొదటి పక్షుల అభయారణ్యాన్ని తమిళనాడు లోని వేదాంతం గల్‌లో ఏర్పాటు చేసింది. ఆ తర్వాత 1935లో మొదటి వన్య ప్రాణి జాతీయ పార్కు 'హేలీ'ని ఉత్తరప్రదేశ్‌లో ఏర్పాటు చేశారు. ఇదే పార్కును ఇప్పుడు జిమ్ కార్బెట్ పార్కు అని పిలుస్తున్నారు. ప్రస్తుతం దేశంలో ఉన్న మొత్తం జాతీయ పార్కుల సంఖ్య 102. 1976లో జరిగిన రాజ్యాంగ సవరణలోని ఆర్టికల్ 51(ఎ) ప్రకారం వన్యప్రాణి సంరక్షణ పౌరుల ప్రాథమిక విధి. ఆదేశిక సూత్రాల్లో కూడా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విధిగా వన్యప్రాణులను సంరక్షించాలని పేర్కొన్నారు. జాతీయ వన్యప్రాణి చట్టం 1972, వన్యప్రాణులను వేటాడటాన్ని పూర్తిగా నిషేధించింది. ఆనాటి ప్రధాని స్వర్గీయ ఇందిరా గాంధీ 1972లో వన్యప్రాణుల సంరక్షణ చట్టాన్ని ప్రవేశపెట్టారు. ఈ చట్టం ప్రకారం వన్య ప్రాణుల వేట నిషేధం. జంతువులపట్ల జాలి, పరితాపములను చూపాలని భారత రాజ్యాంగం 51 ఎ అధికరణం పౌరుల ప్రాథమిక బాధ్యతలను నిర్వచిస్తున్నది. భారత రాజ్యాంగపు 21వ అధికరణం వ్యక్తిగత స్వేచ్ఛ, జీవన హక్కులను ధృవపరుస్తున్నది. భారత పౌరులకు జంతువులను పెంచి పోషించే హక్కును ఈ అధికరణం ధృవపరుస్తున్నది. భారత పార్లమెంటు రూపొందించిన జంతువులపట్ల క్రూరత్వం నివారణ చట్టం సెక్షన్ 11 (1) నుండి (ఓ), ప్రకారం జంతువులను వేటాడటం, స్వాధీనం లేదా పట్టుకోవడం, ఏ జంతువునైనా అవయవమును తొలగించడం లేదా చంపడంవంటి అనేక ఇతర క్రూర చర్యలకు బాధ్యులైన వారిని చట్టం ద్వారా శిక్షిసారు. జంతు రవాణాలో అనవసర హింసకు పాల్పడే వారికి, జంతువులను కిక్కిరిసినట్టుగా వాహనాల్లో నింపేవారికి, జంతువుల కాళ్ళు కట్టేసి వాహనాలపై తీసుకువెళ్ళే వారికి రూ 100 లేదా మూడు నెలల కారాగార శిక్ష లేదా రెండు శిక్షలూ కలిపి విధించవచ్చు. భారత శిక్షా స్మృతి సెక్షను 428 మరియు 429 కింద జంతువులను భయపెట్టడం గాయ పరచడం చట్టవిరుద్ధం. జంతువులను లేదా జంతు సంరక్షకులను భయ కంపితులను చేయడాన్ని 1860 భారత శిక్షాస్మృతి సెక్షన్ 503 ప్రకారం తెలిసి లేదా స్పృహతో చేస్తున్న నేరంగా పరిగణిస్తారు. ఇటువంటి వారిని ఎటువంటి వారంటు లేకుండా అదుపులోకి తీసుకోవచ్చు. జంతుసంపదను పరిరక్షించడం, వాటిని వృద్ధి చేయడంతోపాటు జంతువుల హక్కులను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత. మానవ మనుగడకు అనివార్యమైన జంతు సంపదను పరిరక్షించడం, వృద్ధిచేయడం, జంతువులకూ తగిన గౌరవాన్ని అందజేయడం అందరి బాధ్యత. జంతువులపట్ల మరింత మానవీయంగా ప్రవర్తించడం, ఈ స్ఫూర్తిని భావితరాలకు తెలియజేయడం అవసరం. వన్యప్రాణి సంరక్షణ చట్టానికి తూట్లు పొడుస్తూ అటవీ ప్రాణుల వేట యధేచ్ఛగా జరుగుతుంది. వాస్తవానికి మనం జంతువుల ఆవాసాలను నాశనం చేస్తున్నాం. విచక్షణా రహితంగా అడవులు నరుకుతూ వాటి తావులను, మంచినీటి వనరులను ధ్వంసం చేస్తున్నాం.

## పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై కేంద్రం స్పష్టత!



పశ్చిమాసియా దేశాల్లో యుద్ధ మేఘాలు కమ్ముకున్న వేళ.. భారత్‌లో చమురు నిల్వలపై ఆందోళన వ్యక్తమవుతోంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా ఈ యుద్ధం సుమారు నెలరోజులపాటు కొనసాగవచ్చని చెప్పడంతో.. చమురు నిల్వలపై ఆందోళన మరింత పెరిగింది. ఈ క్రమంలో ప్రస్తుతం ఉన్న పెట్రోల్, డీజిల్ నిల్వలు అయిపోతే ధరలు గణనీయంగా పెరుగుతాయన్న ఊహాగానాలు వ్యక్తమవుతున్న వేళ.. ధరల పెంపుపై కేంద్రప్రభుత్వ వర్గాలు క్లారిటీ ఇచ్చాయి. చమురు, గ్యాస్ నిల్వలపై కీలక ప్రకటన చేశాయి. పెట్రోల్, డీజిల్ ధరలను తక్షణమే పెంచే ఆలోచన లేదని అధికారులు స్పష్టం చేశారు. ప్రస్తుతం దేశంలో చమురు నిల్వలు 45 రోజులకు సరిపడా ఉన్నాయని, చమురు దిగుమతి కోసం ప్రత్యామ్నాయాలు చూస్తున్నామని కేంద్రవర్గాలు తెలిపాయి. ముఖ్యంగా ఎల్ఎన్ జీ, ఎల్ పీజీ దిగుమతుల కోసం ప్రత్యామ్నాయాలు చూస్తున్నట్లు వెల్లడించాయి. ఇరాన్ పై ఇజ్రాయెల్, అమెరికా చేస్తున్న యుద్ధం నేపథ్యంలో హోర్ముజ్ జలసంధి మూతపడిన విషయం తెలిసిందే. దీంతో వేలాది చమురు షిప్పులు సముద్రంలోనే నిలిచిపోయాయి. హోర్ముజ్ జలసంధి సమీపంలో వేలాది చమురు నౌకలు ట్రాఫిక్ జామ్ లో చిక్కుకున్నాయి. ఇవన్నీ ఎగుమతి కావాలంటే యుద్ధం ఆగాలి. అందుకు కనీసం 40 రోజులు సమయం పడుతుందని అంచనా. అక్కడి నుంచి చమురు రాకపోతే మనదగ్గరి నిల్వలు అయిపోతే ధరలు పెరుగుతాయన్న ఆందోళనతో వాహనదారులు పెట్రోల్ బంకులకు క్యూ కడుతున్నారు. మిడిల్ ఈస్ట్ కంట్రీస్ లో నెలకొన్ని ఉద్రిక్తతల నేపథ్యంలో మనవద్ద పెట్రోల్ ధరలు పెరుగుతాయన్న వార్తల నేపథ్యంలో వాహనదారులు పెట్రోల్ బంకులకు క్యూ కట్టారు. హైదరాబాద్ లో వాహనదారులు వాహనాల్లోనే కాక.. బాటిల్స్ లోనూ పెట్రోల్ ఫిల్ చేయించుకుంటున్న దృశ్యాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి.

## భారీ నష్టాల్లో స్టాక్ మార్కెట్లు..

పశ్చిమాసియాలో బాంబుల వర్షం కురుస్తోంది. మరోవైపు ప్రపంచ ఇంధన సరఫరాకు జీవనాడి అయిన హర్మూజ్ జలసంధిని ఏ నౌక దాటాలని చూసినా నిప్పుపెడతామని ఇరాన్ చేసిన హెచ్చరికలతో చమురు ధరలు పెరుగుతున్నాయి. ఈ అంతర్జాతీయ పరిణామాలు రానున్న రోజుల్లో దేశీయంగా ఎలాంటి ప్రభావం చూపుతాయో తెలియని అనిశ్చితి మదుపర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీస్తోంది. దీంతో బుధవారం దేశీయ మార్కెట్లు భారీ నష్టాల్లో ప్రారంభమయ్యాయి. ట్రేడింగ్ ప్రారంభంలో సెన్సెక్స్ 1,700 పాయింట్ల మేర క్షీణించింది. నిఫ్టీ 24,400 దిగువున కదలాడుతోంది. ఉదయం 9.30 గంటల సమయంలో సెన్సెక్స్ 1,670 పాయింట్ల మేర పతనమై 78,565 వద్ద ఉంది. నిఫ్టీ 513 పాయింట్లు కోల్పోయి 24,351 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ సూచీలో ఇన్ఫోసిస్, కోల్ ఇండియా, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, టీసీఎస్, ఓఎన్‌జీసీ షేర్లు లాభాల్లో ఉండగా.. లార్సెన్, టాటా స్టీల్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, శ్రీరామ్ ఫైనాన్స్, అల్ట్రాటెక్ సిమెంట్ షేర్లు నష్టాల్లో కదలాడుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లు కూడా భారీ నష్టాల్లో ఉన్నాయి. మంగళవారం అమెరికా మార్కెట్లు నష్టాల్లో ముగియగా.. నేటి ట్రేడింగ్‌లో ఆసియా మార్కెట్లు కూడా అదే బాటలో ఉన్నాయి. దక్షిణ కొరియా కొస్పి 12 శాతం మేర పడిపోయింది. దాంతో ట్రేడింగ్‌ను నిలిపివేయాల్సిన పరిస్థితి తలెత్తింది. కాగా.. భారత్ చమురు అవసరాల్లో 85 శాతం దిగుమతుల వల్లే తీరుతున్నాయి. ఇప్పటికే పశ్చిమాసియాలో ఘర్షణలు మొదలై ఐదు రోజులు అవుతుండగా.. ఇంకా ఎన్ని రోజులు కొనసాగుతుందో



తెలియని పరిస్థితి నెలకొంది. యుద్ధం తీవ్రమవుతుండటంతో ముడిచమురు ధరలు పెరుగుతున్నాయి. ఇవన్నీ మదుపర్లను అనిశ్చితిలోకి నెట్టేస్తున్నాయి. భారత్‌లో ద్రవ్యోల్బణం, ఆర్థికవృద్ధిపై ఈ ప్రభావం గురించి ఆందోళనలు నెలకొన్నాయి.

యుద్ధం ముదురుతూ ఉంటే.. వాణిజ్యలోటు పెరుగుతుందని, రూపాయి బలహీనపడుతుందని, కార్పొరేట్ ఆదాయాలపై ఒత్తిడి ఉంటుందని జియోజిట్ ఇన్వెస్ట్‌మెంట్స్‌లో చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్స్ స్ట్రాటజిస్ట్ వీకే విజయ్ కుమార్ అంచనా వేశారు. ట్రేడింగ్ ప్రారంభంలో అమ్మకాల ఒత్తిడి కనిపించింది. నిఫ్టీలో లార్సెన్ అండ్ టర్బో స్టాక్ 7 శాతం మేర కుంగింది. ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ 3.5 శాతం క్షీణించింది. వార్ ఎఫెక్ట్‌తో అంతర్జాతీయ విపణిలో దేశీయ కరెన్సీ రూపాయి క్షీణించి, జీవనకాల కనిష్ఠాలకు పడిపోయింది. నేటి సెషన్‌లో 69 పైసలు కోల్పోయి, ఏకంగా 92.18 మార్క్‌ను తాకింది.

## అలీబాబా క్వెన్ ఎఐ విభాగం అధిపతి రాజీనామా





చైనా టెక్ దిగ్గజం అలీబాబా గ్రూప్ కు చెందిన క్వెన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విభాగం అధిపతి లిన్ జున్యాంగ్ తన పదవికి రాజీనామా చేశారు. "బైనా ప్రియమైన క్వెన్," అనిఆయన సోషల్ మీడియా వేదిక ఎక్స్ లో సంక్షిప్తంగా పోస్టు చేశారు. అయితే ఆయన కారణాలను వెల్లడించలేదు. ఈ ఏడాది క్వెన్ విభాగాన్ని వీడిన మూడవ సీనియర్ అధికారి లిన్. క్వెన్ పోస్ట్-ట్రైనింగ్ విభాగానికి నాయకత్వం వహించిన యు బోవెన్ కూడా రాజీనామా చేసినట్లు చైనీస్ మీడియా సంస్థ లేట్‌పోస్ట్ తెలిపింది. జనవరిలో కోడింగ్ పరిశోధన శాస్త్రవేత్త హుయ్ బిన్యువాన్ నిష్క్రమించారు. నిష్క్రమణలపై స్పందించేందుకు అలీబాబా అధికారులు స్పందించలేదు. ఇదేసమయంలో హాంకాంగ్ మార్కెట్‌లో అలీబాబా షేర్లు 2.8% తగ్గిముగిశాయి. మధ్యాహ్న ట్రేడింగ్‌లో 4% వరకు పతనమయ్యాయి. ఇటీవల క్వెన్ నవీకరించిన ఉత్పత్తులను విడుదల చేసిన రెండు రోజులకే ఈ రాజీనామా చోటుచేసుకుంది. క్వెన్ మొబైల్ యాప్ నెలవారీ క్రియాశీల వినియోగదారులు జనవరిలో 31.05 మిలియన్ల నుంచిలో 203 మిలియన్లకు పెరిగినట్లు ఎఐసిపిబి వెల్లడించింది.

## ఈపీఎఫ్ఓ శుభవార్త.. 31 లక్షల మందికి బెనిఫిట్

ప్రైవేట్ రంగంలో ఉద్యోగుల ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన గొప్ప సామాజిక భద్రతా పథకం ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్. దీనిని ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ నిర్వహిస్తోంది. కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఇది పని చేస్తుంది. ఇప్పుడు ఈపీఎఫ్ఓ కు సంబంధించి.. లేబర్ మినిస్ట్రీ ఒక కీలక ప్రకటన చేసింది. ఇది ఒక రకంగా శుభవార్త. ఈపీఎఫ్ఓ ఇన్‌ఆపరేటివ్ అకౌంట్లకు సంబంధించి అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లను వారి వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేయాలని నిర్ణయం తీసుకుంది. క్లెయిమ్ చేయని వారి పీఎఫ్ ఖాతాల్లో పెద్ద మొత్తంలో నిధులు పోగుబడగా.. వీటిని చందాదారుల ఖాతాల్లోకే బదిలీ చేయాలని నిర్ణయించడం విశేషం. ఈ కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో సుమారు 31 లక్షల మంది వరకు చందాదారులకు ప్రయోజనం దక్కనుంది. అయితే పైలట్ ప్రాజెక్టుగా చేపట్టే తొలి విడతలో సుమారు 7 లక్షల మంది వరకు ఈ ప్రయోజనాలు పొందుతారని కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ చెప్పుకొచ్చారు. త్వరలోనే ఇది ప్రారంభించనున్నట్లు తెలిపారు.

ఈపీఎఫ్ఓవీక్లీ రివ్యూ మీటింగ్‌లో ఈ నిర్ణయం తీసుకున్నట్లు మాండవీయ వివరించారు. ప్రస్తుతానికి 31.86 లక్షల వరకు పీఎఫ్ ఖాతాలు.. నిర్వహణ లేవని (ఇనాపరేటివ్) ఈపీఎఫ్ఓ గుర్తించింది. దీంట్లో సుమారు రూ. 10,903 కోట్ల మేర నిల్వలు ఉన్నట్లు అంచనా వేస్తోంది. వీటిల్లో సుమారు 7.11 లక్షల ఖాతాల్లో రూ. 1000 వరకు మాత్రమే నగదు నిల్వలు ఉన్నట్లు పేర్కొంది. వీటి విలువ మొత్తంగా రూ. 30.52 కోట్లుగా ఉన్నాయి. లేబర్ మినిస్ట్రీ ప్రకారం.. ఈ నిర్వహణలో లేని పీఎఫ్ ఖాతాల్లో 20 ఏళ్లకు పైబడినవి కూడా ఉన్నాయి. దాదాపు మూడేళ్లుగా ఎలాంటి ట్రాన్సాక్షన్ నిర్వహించిన పీఎఫ్ అకౌంట్లను ఇన్‌ఆపరేటివ్ అకౌంట్లుగా పేర్కొంటారు. ఇప్పుడు ఈపీఎఫ్ఓ కు సంబంధించి.. లేబర్ మినిస్ట్రీ ఒక కీలక ప్రకటన చేసింది. ఇది ఒక




రకంగా శుభవార్త. ఈపీఎఫ్ఓ ఇన్‌ఆపరేటివ్ అకౌంట్లకు సంబంధించి అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లను వారి వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేయాలని నిర్ణయం తీసుకుంది. క్లెయిమ్ చేయని వారి పీఎఫ్ ఖాతాల్లో పెద్ద మొత్తంలో నిధులు పోగుబడగా.. వీటిని చందాదారుల ఖాతాల్లోకే బదిలీ చేయాలని నిర్ణయించడం విశేషం. ఈ కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో సుమారు 31 లక్షల మంది వరకు చందాదారులకు ప్రయోజనం దక్కనుంది. అయితే పైలట్ ప్రాజెక్టుగా చేపట్టే తొలి విడతలో సుమారు 7 లక్షల మంది వరకు ఈ ప్రయోజనాలు పొందుతారనికేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ చెప్పుకొ చ్చారు.

త్వరలోనే ఇది ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఇప్పుడు ఈపీఎ ఫ్ఓ కు సంబంధించి.. లేబర్ మినిస్ట్రీ ఒక కీలక ప్రకటన చేసింది. ఇది ఒక రకంగా శుభవార్త. ఈపీఎఫ్ఓ ఇన్‌ఆపరేటివ్ అకౌంట్లకు సంబంధించి అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లను వారి వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేయాలని నిర్ణయం తీసుకుంది. క్లెయిమ్ చేయని వారి పీఎఫ్ ఖాతాల్లో పెద్ద మొత్తంలో నిధులు పోగుబడగా.. వీటిని చందాదారుల ఖాతాల్లోకే బదిలీ చేయాలని నిర్ణయించడం విశేషం.

## ఆయుధాల ఉత్పత్తిపై అమెరికా కీలక సమావేశం!



ఇరాన్‌పై జరిగిన తాజా దాడుల అనంతరం తగ్గిన ఆయుధ నిల్వలను పునరుద్ధరించేందుకు అమెరికా ప్రభుత్వం కీలక చర్యలకు సిద్ధమవుతోంది. ఆయుధాల ఉత్పత్తిని వేగవంతం చేసే అంశంపై చర్చించడానికి ట్రంప్ పరిపాలన వైట్ హౌస్ లో అగ్రశ్రేణి రక్షణ కాంట్రాక్టర్ల ప్రతినిధులతో సమావేశం కానుందని రాయిటర్స్ వార్తా సంస్థ వెల్లడించింది. ఈ సమావేశానికి లాక్‌హీడ్ మార్టిన్ మరియు రేథియాన్‌తో వంటి ప్రధాన కంపెనీల కార్యనిర్వాహకులను ఆహ్వానించినట్లు సమాచారం. ఉత్పత్తిదారులను వేగంగా చర్యలు తీసుకునేలా ఒత్తిడి చేయడంపై ఈ చర్చలు కేంద్రీకృతమవుతాయని ప్రణాళికకు పరిచయమున్న వర్గాలు పేర్కొన్నాయి. అయితే,సోషల్ మీడియా వేదికలో చేసిన ఒక పోస్టులో మాజీ అధ్యక్షుడు ట్రంప్ అమెరికా వద్ద ఆయుధ సామగ్రి "వాస్తవంగా అపరిమితంగా ఉంది" అని, అవసరమైతే ఈ సామగ్రితో యుద్ధాలను "ఎప్పటికీ" విజయవంతంగా కొనసాగించగలమని వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో పెంటగాన్ నిల్వల పునరుద్ధరణ చర్యలు, రాజకీయ ప్రకటనల మధ్య వ్యత్యాసంపై చర్చ కొనసాగతోంది.

## చాట్‌జిపిటికి పెంటాగన్‌తో ఒప్పందం దెబ్బ..!

అమెరికా రక్షణ శాఖ (పెంటాగన్)తో ఓపెన్ ఎఐ కుదుర్చుకున్న వివాదాస్పద ఒప్పందంపై యూజర్ల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ప్రత్యర్థి సంస్థ ఆంత్రోపిక్ తమఎఐ సాంకేతికతను సామూహిక నిఘాకు లేదా అటానమస్ ఆయుధాలకు ఉపయోగించకూడదని నిబంధన విధించడంతో పెంటాగన్ ఆ సంస్థను పక్కన పెట్టింది. ఆ వెంటనేచాట్‌జిపిటి మాతృసంస్థ ఓపెన్ ఎఐ రంగంలోకి దిగి ఈ ఒప్పందాన్ని సొంతం చేసుకోవడంపై నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీని ఫలితంగా అమెరికాలో చాట్‌జిపిటి యాప్ తొలగింపులు (అన్‌ఇన్‌స్టాల్) ఒక్కసారిగా 295 శాతం పెరగగా, వన్‌స్టార్ రేటింగ్‌లు 775 శాతం పెరిగాయి. ఎఐ సాంకేతికతను అమెరికన్లపై నిఘా పెట్టడానికి, యుద్ధాల్లో ఉపయోగించడానికి ఓపెన్ ఎఐ అంగీకరించడంతో నిరసన వ్యక్తం అవుతోంది. రక్షణ ఒప్పందాలకు దూరంగా ఉంటామని ప్రకటించిన ప్రత్యర్థి సంస్థ ఆంత్రోపిక్‌కి చెందిన క్లాడ్ యాప్ డౌన్‌లోడ్లు 88 శాతం పెరిగి, అమెరికా యాప్ స్టోర్‌లో నంబర్ వన్ స్థానానికి చేరుకుంది. ఈ వివాదంపై ఓపెన్ ఎఐ సిఇఒ శామ్ ఆల్ట్‌మాన్ స్పందిస్తూ.. పెంటాగన్ ఒప్పందం జరిగిన తీరు అస్తవ్యస్తంగా ఉందని అంగీకరించారు. ఆంత్రోపిక్‌తో పెంటాగన్‌కు విభేదాలు వచ్చిన వెంటనే ఈ ఒప్పందం చేసుకోవడం వల్ల యూజర్లకు తప్పుడు సంకేతాలు వెళ్లాయన్నారు. తమ ఎఐ సాంకేతికతను అమెరికన్లపై నిఘా పెట్టడానికి లేదా అటానమస్ ఆయుధాల తయారీకి ఉపయోగించకూడదనే నిబంధనలను స్పష్టం చేసినాకే తాము రక్షణ శాఖతో కలిసి పనిచేస్తున్నామని ఆయన వివరించారు.

# కేదార్‌నాథ్‌లో వాటర్ బాటిల్ రూ.100



**కేదార్‌నాథ్ యాత్రలో నీళ్ల బాటిల్ ధరపై తీవ్ర చర్చ**
**లీటర్ వాటర్ బాటిల్ ధర రూ. 80 నుంచి రూ. 100**
**రవాణా కష్టాల వల్లే అధిక ధరలంటున్న వ్యాపారులు**
**బరువైన లోడ్లు మోస్తున్న కూలీల వీడియోలు వైరల్**
**ధరలపై సోషల్ మీడియాలో భిన్నాభిప్రాయాలు**

ఢిల్లీ,: దేశంలోని అత్యంత పవిత్ర పుణ్యక్షేత్రాలలో ఒకటైన కేదార్‌నాథ్ ఆలయ ద్వారాలు ఈ నెల 22న భక్తుల కోసం తెరుచుకున్నాయి. యాత్రికులు మంచు కొండల మధ్య కఠినమైన ప్రయాణం చేస్తూ స్వామిని దర్శించుకుంటున్నారు. అయితే, ఈ యాత్రలో ఒక చిన్న విషయం ఇప్పుడు సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారితీసింది. అదే కేదార్‌నాథ్‌లో మంచినీటి బాటిల్ ధర. ఇక్కడ ఒక లీటర్ ప్యాకేజ్డ్ వాటర్ బాటిల్ ధర రూ. 80 నుంచి రూ. 100 వరకు పలుకుతోంది. ఇది సాధారణ ఎంఆర్పీ కంటే నాలుగు నుంచి ఐదు రెట్లు ఎక్కువ. ఈ అధిక ధరపై ఓ పర్యాటకుడు దుకాణదారుడిని ప్రశ్నించిన వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీనిపై ఆ వ్యాపారి ప్రశాంతంగా సమాధానమిస్తూ, అక్కడి వాస్తవ పరిస్థితులను వివరించాడు. "ఇక్కడికి సరుకులు తీసుకురావడానికి సరైన రోడ్లు లేవు, వాహనాలు రావు. మూడు కార్టన్ల లోడ్ తీసుకురా వడానికే రవాణాకు రూ. 1500 అదనంగా ఖర్చవుతుంది. గాడిదలు లేదా మనుషుల వీపులపై మోసుకొని తీసుకురావాలి. ఇక్కడ దుకాణాల అద్దెలు కూడా చాలా ఎక్కువ. వ్యాపారం కేవలం 4-5 నెలలే ఉంటుంది. మాకు పెద్దగాలాభాలు రావు" అని ఆవ్యాపారి వివరించాడు. ఈ రవాణా వెనుక ఉన్న శ్రమను కళ్లకు కట్టే మరో వీడియో కూడా వెలుగులోకి వచ్చింది. నేపాల్‌కు చెందిన ఓ వ్యక్తి తన వీపుపై భారీగా వాటర్ బాటిళ్లు, మిల్క్‌షేక్ ప్యాకెట్లను మోసుకెళ్తున్న దృశ్యం అందులో ఉంది. సుమారు 40 కిలోల బరువున్న ఈ లోడ్‌ను కేదార్ నాథ్‌కు చేర్చినందుకు తనకు రూ.2,500 వస్తుందని అతడు చెప్పాడు. ఈ వీడియోలు ఆన్‌లైన్‌లో పెద్ద చర్చకు దారితీశాయి. ఎత్తైన ప్రదేశాలకు సరుకులు చేర్చడంలో ఉండే కష్టాన్ని, శ్రమను చూస్తే ఈ ధర సమర్థనీయమేనని చాలామంది అభిప్రాయపడుతున్నారు. "ఏసీ హాల్‌లో రూ. 350 పెట్టి పాప్‌కార్న్ కొనగలం కానీ, రవాణా సౌకర్యం లేని కొండపై నీళ్లు కొనలేమా?" అని ఒకరు ప్రశ్నించారు. అయితే మరికొందరు మాత్రం, నీరు నిత్యావసరం కాబట్టి దానిపై ఇంత ధర వసూలు చేయడం సరికాదని వాదిస్తున్నారు. మొత్తంమీద కేదార్‌నాథ్ వంటి క్షేత్రాలలో అధిక ధరల వెనుక ఉన్న క్లిష్టమైన రవాణా వ్యవస్థ, శ్రమ, ఆర్థిక వాస్తవాలను ఈ చర్చ ఎత్తిచూపుతోంది.

# ఇండియా అంటే ఇదే అనుకున్నా..
# కానీ అంతకుమించి

**- భారత్‌లో తనను ఆశ్చర్యపరిచిన పది విషయాలపై విదేశీ యువతి మియా పోస్ట్**
**- ఇక్కడి ప్రజలు ఇంగ్లిష్ మాట్లాడే తీరు అద్భుతమని ప్రశంస**
**- మారుమూల ప్రాంతాల్లోనూ ఉబెర్ సేవలు అందుబాటులో ఉండటంపై ఆశ్చర్యం**
**- దేశవ్యాప్తంగా భారతీయ పర్యాటకులు ఎక్కువగా కనిపించడం ఊహించలేదన్న మియా**
**- చివరకు తాను ఇండియా ప్రేమలో పడిపోయానని వెల్లడి**



ఢిల్లీ,:భారత పర్యటనకు వచ్చిన ఓవిదేశీ యువతి, ఇక్కడి పరిస్థితులు, ప్రజల గురించి తన అనుభవాలను సోషల్ మీడియాలో పంచుకోగా అది ఇప్పుడు వైరల్‌గా మారింది. "ఇండియా నుంచి నేను ఊహించని 10 విషయాలు" అనే టైటిల్‌తో మియా అనే యువతి ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టిన పోస్ట్ ఎంతోమంది దృష్టిని ఆకర్షిస్తోంది.గోవాలో యోగా క్లాస్‌ముగించుకున్న తర్వాత బీచ్‌పక్కన ఈ వీడియోచేసినట్టుఆమె పేర్కొంది. ఈ దేశం తనను ఎంతగానో ఆకట్టుకుందని, చివరికి ఇండియా ప్రేమలో పడిపోయానని ఆమె చెప్పింది. మియా తన పోస్ట్‌లో పలు ఆసక్తికర విషయాలను ప్రస్తావించింది. ముఖ్యంగా దేశంలోని వివిధ ప్రాంతాలను చుట్టివస్తున్న భారతీయ పర్యాటకుల సంఖ్యను చూసి తాను ఆశ్చర్యపోయానని చెప్పింది. తాను గతంలో పర్యటించిన దేశాల్లో ఈ పరిస్థితి చూడలేదని, మొదట్లో హాస్టళ్లలో తాము మాత్రమే విదేశీయులుగా ఉండటం వింతగా అనిపించినా, వెంటనే మంచి భారతీయ స్నేహితులు దొరికారని మియా వివరించింది. వారితో కలిసి వారం రోజులకు పైగా ప్రయాణించామని తెలిపింది. అలాగే, భారతీయుల ఇంగ్లిష్ భాషా నైపుణ్యం తనను అబ్బురపరిచిందని మియాపేర్కొంది. "ఇక్కడి వారు చాలా స్పష్టంగా ఇంగ్లిష్ మాట్లాడుతున్నారు. స్లాంగ్ కూడా ఉపయోగి స్తున్నారు. చిన్నప్పటి నుంచే పాఠశాలల్లో ఇంగ్లిష్ బోధించడం, సోషల్ మీడియా ప్రభావం ఇందుకు కారణమై ఉండొచ్చు" అని ఆమె అభిప్రాయపడింది. దీనివల్ల స్థానికులతో సులభంగా కలిసిపోగలిగానని చెప్పింది. ఇక, ఆధునిక సదుపాయాల గురించి మాట్లాడుతూ.. మారుమూల ప్రాంతాల్లో కూడా ఉబెర్ వంటి క్యాబ్ సేవలు అందుబాటులో ఉండటం తనను ఆశ్చర్యానికి గురిచేసిందని మియా తెలిపింది. డెలివరీ యాప్‌లు కూడా చాలా సులభంగా ఉన్నాయంది. ప్రతి రెస్టారెంట్‌లో చేతులు కడుక్కోవడానికి సింక్‌లు, సబ్బులు ఉండటం కూడా ఊహించని విషయమని ఆమె పేర్కొంది. దేశవ్యాప్తంగా చైనీస్, ఇజ్రాయెల్ వంటకాలు సులభంగా దొరికాయని, మంచి షక్షుకా, హమ్మస్ వంటివి కూడా తిన్నానని చెప్పింది. అయితే, కొన్ని జాగ్రత్తలు కూడా అవసరమని మియా సూచించింది. నకిలీ పనీర్, నీటి విషయంలో కాస్త అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. అలాగే రైళ్లలో ప్రయాణించాలంటే టికెట్లను ముందుగానే బుక్ చేసుకోవాలని, సీట్లు త్వరగా నిండిపోతాయని తెలిపింది.

# 'ఉపాధి'లో సౌకర్యాలు కరువు



**- పొట్ట కూటి కోసం మండుటెండలోనే పని**

కాకినాడ,తెలంగాణ దిశ :ప్రస్తుతం రాష్ట్రంలో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. పొట్ట కూటి కోసం మండుటెండను సైతం లెక్కచే యకుండా ఉపాధి కార్మికులు పనులు చేస్తున్నారు. పని ప్రదేశంలో గుక్కెడు నీరు, నీడ కోసం చలువ పందిళ్లు, సరైన వసతులు లేకపోవ డంతో అల్లాడిపోతున్నారు. కాకినాడ జిల్లాలోని 20 మండలాల్లో 280 గ్రామాల్లో ఉపాధి పనులు జరుగుతున్నాయి. 2.29 లక్షల జాబ్ కార్డులు ఉండగా 2.5 లక్షల మంది వేతనదారులున్నారు. జిల్లాలో ప్రతీ రోజు సగటున 1.4 లక్షల మంది కార్మికులు పనులు చేస్తున్నారు. ప్రస్తుతం 20నుంచి 22వేలమంది పనులను వెళ్తున్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో భాగంగా గతంలో పలు సౌకర్యాలు ఉండేవి. 2021 వరకూ పని ప్రదేశంలో ఎండ తీవ్రతను తట్టుకునేందుకు టెంట్లు ఏర్పాటు చేసేవారు. లీటరు తాగునీటి కోసం రూ.2.50, గునపానికి రూ. పది, పార లేదా తట్టకి రూ.మూడు ఇచ్చేవారని, ఇప్పుడు అవేమీ ఇవ్వడం లేదు. ఐదేళ్ల నుంచి ఈ సౌకర్యా లు కనుమరుగయ్యాయి. పని ప్రదేశంలో టెంట్లు లేకపోవడంతో కార్మికులు మండుటెండల్లోనే పనులు చేస్తున్నారు. నీడలేక తీవ్ర అవస్థలు పడుతున్నామని పిఠాపురం మండలం మల్లాం గ్రామానికి చెందిన ఉపాధి కార్మికుడు దుగ్గాడ శ్రీనివాసరావు, పి.రాయవరానికి చెందిన ఉబా బుల్లబ్బాయి, కలదారి రాఘవ, మంగితుర్తికి చెందిన డెక్కల లాజర్, తిమ్మాపురం గ్రామానికి చెందిన బత్తుల నాగరాజు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి టెంట్లు సరఫరా లేదని, కొన్ని చోట్ల ఆరోగ్య కేంద్రాల్లో ఇచ్చిన ఒఆర్ఎస్ ప్యాకెట్లను అవసరమైన వారికి అందిస్తున్నామని ఫిల్డ్ అసిస్టెంటు పేర్కొన్నారు.

# బిఆర్ఎస్ నేతల్లో ఆందోళన..!




హైదరాబాద్,తెలంగాణ దిశ: తెలంగాణలో మరో కొత్త పార్టీ పురుడు పోసుకుంది. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కొత్త రాజకీయ పార్టీని ఆవిష్కరించారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మునీరాబాద్ లోని అద్వయ కన్వెన్షన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ మీటింగ్‌లో కవిత తన కొత్త పార్టీ పేరు 'తెలంగాణ రాష్ట్ర సేనగా అంటే టిఆర్ఎస్‌గా ప్రకటించారు. పార్టీ పేరు బిఆర్ఎస్‌కు షాక్‌కు గురి చేసింది. శనివారం ఉదయం కవిత సర్వ మత ప్రార్థనలు చేశారు. బంజారాహిల్స్‌లోని తన నివాసం నుంచి ర్యాలీగా బయల్దేరారు. గన్‌పార్కులో అమరవీరులకు నివాళులు అర్పించారు. అనంతరం నేరుగా సభా ప్రాంగణానికి చేరుకుని ఉదయం 10 గంటలకు పార్టీ పేరు ప్రకటించారు. అనంతరం.. పార్టీ జెండా విష్కరించారు. ఈ పార్టీ పేరు బీఆర్ఎస్‌ను బిగ్ షాక్‌కు గురి చేసింది. ఇదిలా ఉండగా.. పార్టీ ప్రకటించే సభా ప్రాంగణాన్ని తెలంగాణ కలలు ఉట్టిపడేలా డిజైన్ చేయడం ఆకట్టుకుంది. వరంగల్ కాకతీయ కళా తోరణం ఆకృతిలో ఏర్పాటు చేసిన ప్రధాన ద్వారం, తెలంగాణ ఆత్మగౌరవాన్ని ప్రతిబింబించేలా తెలంగాణ తల్లి విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. బీఆర్ అంబేద్కర్, జ్యోతిరావు ఫులే, ఆచార్య జయశంకర్ విగ్రహాలను సైతం ఏర్పాటు చేశారు. ద్వారానికి చాకలి ఐలమ్మ పేరు పెట్టారు. బిఆర్ఎస్‌ను మళ్లీ టిఆర్ఎస్‌గా మార్చే ఆలోచన ఉందని ఇటీవలే ఓ సందర్భంలో కెటిఆర్ అన్నారు. ఇప్పుడు టిఆర్ఎస్ ఆవిర్భావంతో వారికి షాక్ తగిలినట్లు అయ్యింది. అంతేగాకుండా తండ్రిని, అన్నను ఆమె టార్గెట్ చేస్తూ విమర్శలు గుప్పించారు. ఫాంహౌస్ వీడి కేసీఆర్ బయటకు రాకపోవడాన్ని తీవ్రంగా తప్పుపడుతున్నా. కేసీఆర్ రాజకీయ పరిణితి కోల్పోయారు. ప్రజల కోసం కొట్లాడాల్సిన ప్రతిపక్ష నేత కేసీఆర్ ఎక్కడ?. అధికారం వచ్చాక ఆయన మమకారం కోల్పోయారు.

మారిన మరబొమ్మ కేసీఆర్. మాటల మనిషి, మర మనిషి, మారిన మనిషి కేసీఆర్. ఎక్కడ కష్టం వచ్చినా ఆ సారు రారు. గుంట నక్కల, తోడేళ్ల చేతిలో బందీ అయిన మనిషి. అదే మన కేసీఆర్ అయితే పాలమూరు దగ్గర కుర్చీ వేసుకుని మరీ పనులు పూర్తి చేసేవారు. కేసీఆర్ మారతారేమో అని చూశా. ఇళ్లు, భూములు అమ్ముకుని రాష్ట్రం కోసం పోరాటం చేసిన ఉద్యమకారులను ఏం చేశారు. తెలంగాణ ఉద్యమకారుల మీద కర్రలతో దాడులు చేసిన వారికి పదవులు ఇచ్చారు. ఉద్యమకారులకి మర్యాద ఇచ్చారా?. కేసీఆర్ మారిపోయారు కాబట్టే నేను యుద్ధం చేస్తున్నా. మనకు ప్రాణాలు అడ్డంపెట్టి పోరాడే సైన్యం కావాలి. నేను ఏం తప్పు చేశానని నన్ను పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. కాళేశ్వరం మీద మాట్లాడితే సస్పెండ్ చేస్తారా?. అవినీతి చేసిన పందికొక్కులని కేసీఆర్ పక్కన పెట్టుకున్నారు అంటూ విమర్శలు గుప్పించారు.

# సింగరేణి కార్మికుల ఆరోగ్య పరిస్థితిపై ప్రత్యేక శ్రద్ధ



**సింగరేణి ప్రధాన ఆసుపత్రిలో మెగా గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్య శిబిరం**
**సింగరేణి ఆసుపత్రి ఏసిఎంఓ డాక్టర్ ఎం. ఉష**

కొత్తగూడెం,తెలంగాణ దిశ : సింగరేణి సంస్థలో పనిచేసే ఉద్యోగులు కాంట్రాక్టు కార్మికులు, రిటైర్డ్ కార్మికులు వారి కుటుంబ సభ్యుల సంక్షేమంలో భాగముగా వారి కోసం సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో గ్యాస్ట్రో ఎంటరాలజీ సమస్యలు గల వారి కొరకు హైదరాబాద్ కు చెందిన రెనోవా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి శనివారం ఉచిత ప్రత్యేక మెగా గ్యాస్ట్రో ఎంటరాలజీ పరీక్షా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏసిఎంఓ ఎం.ఉషహాజరై ఈ కార్యక్రమాన్ని ప్రారంబించారు. ఈ సందర్భం గా ఏసిఎంఓ ఎం.ఉష మాట్లాడుతూ సింగరేణి సంస్థ కార్మికుల, ఉద్యోగుల సంక్షేమం విషయములో ముందు వరుసలో ఉంటుంది అని సింగరేణిలో పనిచేసే ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు, రిటైర్డ్ కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు సూపర్ స్పెషాలిటీ వైద్యం అందించాలనే ఉద్దేశంతో ఇలాంటి శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఉద్యోగులు హైద్రాబాద్ కు వెళ్ళే అవసరం లేకుండా వారి సౌలభ్యం కొరకు హైద్రాబాద్ లో గల అన్నీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల వారిచే మన సింగరేణి ఆసుపత్రులలోనే వైద్యం అందిస్తున్నామని పేర్కొన్నారు. అందులో భాగంగా రెనోవా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, వారిచే జీర్ణవ్యవస్థ కు సంబందించిన వ్యాధులు, తీవ్రమైన లేదా దీర్ఘకాలికంగా వేధిస్తున్న కడుపు నొప్పి, తరచుగా గుండెల్లో మంట, ఆహారం మింగడంలో ఇబ్బంది, మలబద్ధకం లేదా రక్త విరేచనాలు, ఆకస్మికంగా బరువు తగ్గడం మొదలుగు లక్షణాలు గల వారి కోసం ప్రత్యేక ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అదే విధముగా ప్రతీ రెండవ ఆదివారం నాడు సింగరేణి ప్రధాన ఆసుపత్రి లో సూపర్ స్పెషాలిటీ మెడికల్ క్యాంపులను నిర్వహించుకుంటున్నామని వివరించారు. కాగా ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు, రిటైర్డ్ కార్మికులు వారి కుటుంబ సభ్యులు ఈ సూపర్ స్పెషాలిటీ మెడికల్ క్యాంపులను కూడా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమానికి హాజరైన మొత్తం75మందికినిష్ణాతులైన ఉచితముగా ప్రత్యేక పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఎండోస్కోపీ పరీక్షలను చేసి వారికి సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో ఏసిఎంఓ ఎం.ఉష, డివై.సిఎంఓలు నాగరాజు,కే.ఎస్ విశ్వమేధి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ డి.లలిత, రెనోవా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సిబ్బంది, మెయిన్ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజాప్రతినిధులకు జీతాలు ఎందుకు ?

ఉద్యోగుల బకాయిలు ఆరువేల కోట్లకు పైగా చెల్లించాల్సి ఉందని కేబినేట్ భేటీలో చర్చకు వచ్చింది. గత పదేళ్ల కెసిఆర్ పాలనలో, ఇప్పుడు రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనలో ఇవి అలాగే ఉండిపోయాయి.ఇంకా పెరిగి పోతున్నాయి. అయినా చీమకుట్టినట్లుగా లేదు. ఉచిత పథకాలకు, దుబారా ఖర్చులుకు వెనకాడని ప్రభుత్వం ఉద్యోగుల విషయంలో మాత్రం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోంది. మంత్రులు, ఎమ్మెల్యలే జీతాల్లో 50శాత ఇప్పుడు వీరికి చెల్లిస్తామని, వందరోజుల్లోగా బకాయిలు పూర్తిగాచెల్లిస్తామని మంత్రులు చెప్పు కొచ్చారు. అసలు మంత్రులు, ఎమ్మెల్యేలకు జీతాలు ఎందుకు? లక్షల్లో వారికి ఎందుకు చెల్లించాలి. ఎందుకు వారికి పెన్షన్లు చెల్లించాలన్నది ఆలోచించాలి. ముందు వారి జీతాలను మొత్తంగానే ఆపేయాలి. పెన్షన్లను రద్దు చేయాలి. ప్రజాప్రతినిధులకు లక్షల్లో జీతాలు ఎందుకు? పేరున్న, డబ్బున్న వారు కూడా ఇప్పటికీ పెన్షన్లు పొందుతున్నారు. ఎన్నికల సమయంలో ఉచితానుచితాలు మరచి ఎప్పటికప్పుడు ఆకర్షణీయ పథకాలను గుప్పిస్తున్నారు. అధికారంలో లేనప్పుడు ఉచితాల గురించి విమర్శించినవారే, తీరా అధికారంలోకివస్తే అదే ఓటర్లను ఆకట్టుకునేందుకు ఉచిత పథకాలను ఏకరువు పెడుతున్నారు. ఎన్నికల్లో విపరీతంగా డబ్బులు పంచి పెడుతున్నారు. అభివృద్ధిని పక్కనపెట్టి ఎన్నికల్లో ప్రయోజనం పొందడాని కన్నట్లు ఉచితాల మీద ఉచితాలు ప్రకటిస్తున్నారు. వీటివలన పేదలకు చెప్పుకోదగిన శాశ్వత ప్రయోజనం దక్కదు సరికదా, అత్యవసరంగా లాభపడేది పార్టీలు మాత్రమే. ప్రభుత్వాలు ఆర్థికంగా దివాలా కొడుతున్నాయి. జీతాలు ఇవ్వాలంటే మళ్ళీ అప్పులకు దేబిరించాల్సి వస్తోంది. ఉచిత పథకాలతో ప్రజలు సోమరులుగా మారి, పనిచేయడానికి ముందుకు రారని సుప్రీంకోర్టు చేసిన హెచ్చరికను ఎవరూ పట్టించు కున్నట్లు లేదు. అత్యున్నత ధర్మాసనం వ్యాఖ్యలను కూడా సీరియస్‌గా తీసుకోవడం లేదు. ప్రజల బతుకులు బాగుపడే శాశ్వత ఆలోచన చేయడమే ప్రభుత్వ కర్తవ్యం కావాలి. ప్రస్తుత పరిస్థితులలో ఓటు కొనుక్కోకూడదు. ఓటు అమ్ముకోకూడదు అని చెబితే వినే వారెవరూ లేరు. దీనికితోడు ఉచిత పథకాలు రాష్ట్రాల, దేశ ఆర్థిక వ్యవస్థను సర్వనాశనం చేస్తున్నా.. అధికారంలో ఉన్నవారు పట్టించుకోవడం లేదు. రాష్ట్రాలు ఆర్థికంగా దివాళా తీస్తున్నా, జీతాలు కూడా ఇవ్వలేని దుస్థితిలో ఉన్నా పట్టించుకోవడం లేదు. తెలంగాణలో ఇప్పుడు జీతాలు కూడా అప్పులు చేసి ఇవ్వాల్సి వస్తోంది.అధికారంలో ఉండగా తెలంగాణను అప్పుల్లో ముంచిన బిఆర్ఎస్ ఇప్పుడు విపక్షంలో ఉంటూ..మరిన్ని ఉచితపథకాల గురించి డిమాండ్ చేస్తున్నారు. తులం బంగారం ఇచ్చారా.. రైతుబంధు వేశారా.. పెన్షన్లు నాలుగు వేలు ఇచ్చారా అంటూ నిలదీస్తున్నారు. గురుకులాలు అధ్వానంగా మారడానికి కాంగ్రెస్ కారణమన్నారు. నిజానికి గురుకులాలను లేదా హాస్టళ్లను ఒక్క గొడుగు కిందకు తీసుకుని రావాల్సి ఉంది. విద్య, వైద్యాలకు ఖర్చు చేయకుండా ఉచిత పథకాలకు చేస్తున్న ఖర్చులను వెంటనే ఆపకపోతే జీతాలు ఇవ్వలేరని తేలుతుంది. పెన్ష నర్ల బకాయిలు చెల్లించడం లేదు. ఆర్టీసీ సమ్మెకు డబ్బులే కారణం. డబ్బులు ఇవ్వలేక, వారికి చెల్లింపులు చేయలేక,మహాలక్ష్మి పథకంతో దివాళా తీయిస్తూ, ఇవాళ ఆర్టీసీ సమ్మెలో ఓ కార్మికుడిని బలి తీసుకు న్నారు. శంకర్ గౌడ్ మృతి నిజానికి తీవ్ర విషాదం. తెలంగాణ ఉద్యమంలో కూడా ఇలాగే ఆత్మహత్య ల కు కాంగ్రెస్ కారణమయ్యింది. ముందుగా ఆర్టీసీ సమస్యను తేల్చాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉంది. ఎపిలో జగన్ కూడా ఇదే తరహాలో బటన్ నొక్కుడు పథకాలతో దివాళా తీయించారు. చంద్రబాబు కూడా చేతికి ఎముక లేదన్నట్లుగా పథకాలను అందిస్తున్నారు. ఈ పథకాలు కొంపముంచుతున్నా ,రాష్ట్రాలను దివాళా తీయిస్తున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. ఉచితాల పంపిణీలపై రాజకీయ నాయకులకు కనువిప్పు కావాలి. ప్రభుత్వం ద్వారా అన్నీ ఉచితంగా పొందాలనే మనస్తత్వం కారణంగా దేశంలో అభివృద్ధి కుంటుపడిపోతోంది. ఉచిత పథకాలకి ఖజానా ఖాళీ అయిపోతోంది. దానిని నింపడానికి మళ్ళీ అప్పులు. ఈ పద్ధతి ఏ ప్రభుత్వానికీ మంచిది కాదు. లక్షల కోట్లు అప్పులు తెచ్చి, వడ్డీలు కట్టలేక, ఉద్యోగుల జీతాలు కూడా భారమై ప్రభుత్వాలు నవ్వుల పాలవుతున్నాయి. జీతాలు కూడా చెల్లించ లేనప్పుడు మళ్లీ జనం నుంచే వసూలు చేయాలి. ఉచితాల పంపిణీ వలన జనంలో పేదరికం తగ్గిపోయిందని చెప్పడం అలవాటు చేసుకున్నారు. ముఖ్యంగా అధికారంలోకి రావడానికి అనేక విధాలుగా ఉచిత పథకాలపై హామీలు గుప్పిస్తూ, తీరా అధికారంలోకి వచ్చాక చేతులెత్తే యడం పరిపాటిగా మారింది. దీనిపై సుప్రీం ధర్మాసనం గట్టిగానే హెచ్చరించినా పట్టింపు లేదు. ఉచిత రేషన్,ఉచిత గ్యాస్,ఉచిత ఇల్లు, ఉచిత బియ్యం, ఉచితంగా పెన్షన్ వంటివన్నీ ఖజానాను దివాళా తీయిస్తున్నాయి. ఎన్నికల సంఘం కూడా దీనిపై దృష్టి సారించాలి. సంక్షేమం అవసరమే కానీ మోతాదు మించకుండా చూసుకోవడం మంచి పద్ధతి. ఉచితాలనుఅమలు చేస్తే ఎక్స్ ప్రెస్ వేలు, విమానా శ్రయాలు, రక్షణ కారిడార్లను నిర్మించుకోలేం. విద్య, వైద్యం అందిం చలేం. ఉచితాల విషయమై రాజ్యాంగపరంగా నిషేధాలు విధించడం అవసరమేమో ఆలోచించాలి. భారతదేశ ఆర్థిక పరిస్థితిని ఆందోళన కర స్థాయికి తీసుకెళ్తాయని ఆర్థికవేత్తలు హెచ్చరిస్తున్నారు. తక్షణం వాటిని నివారించడంతో పాటు. ఈ బాధ్యతను కేంద్రప్రభుత్వమే తీసుకోవాలి. జీతాల చెల్లింపు లాంటి రోజువారీ కార్యక్రమాలను ఆపరాదు. అందుకోసం ముందుగా ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఎంపిల జీతభత్యాలను నిలిపివేసే పథకంతో ప్రారంభిస్తే మంచిది.

# పెట్రోల్ ధరలు పెరుగుతాయా.. తగ్గుతాయా ?




ముంబై, : పశ్చిమాసియా యుద్ధం కారణంగా దేశంలో చమురు కొరత నెలకొంది. ఇప్పటికే ఎల్పీజీ ధరను కేంద్రం పెంచింది. యుద్ధం ముగిసే సూచనలు కనిపించడం లేదు. సీజ్‌ఫైర్ కుదిరినా శాశ్వత శాంతి ప్రయత్నాలు ఫలించడం లేదు. మరోవైపు హర్మూజ్‌లో ఇప్పుడు అమెరికా పట్టు సాధించింది. ఈ నేపథ్యలో చమురు ధరలు పెరుగుతా యని ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో కేంద్ర పెట్రోలియం శాఖ అధికారులు పెట్రోల్, డీజిల్ ధరల పెంపు గురించి వ్యాప్తమైన ఆందోళనలను తొలగించారు. ప్రభుత్వ స్థాయిలో అలాంటి ప్రతిపాద నలు లేవని ప్రకటించింది.సోషల్ మీడియాలో పెట్రోల ధరలు రూ.5 నుంచి 10 వరకు ధరలు పెరుగుతాయనే తప్పుడు సమాచారం వ్యాప్తి చెందింది. ఈ వార్తలు వాహనదారులు, వ్యాపారుల్లో టెన్షన్‌కు కారణమయ్యాయి. కేంద్రం ట్విట్టర్ ద్వారా తక్షణ స్పందించి, ఇలాంటి ప్రణాళికలు లేనటి వాస్తవాన్ని ప్రకటించింది. 40 ఏళ్లుగా ఇంధన ధరల్లో మార్పు లేకుండా ఉన్న ఏకైక దేశం భారత్. అంతర్జాతీయ క్రూడ్ ఆయిల్ ధరలు 70?80 డాలర్ల మధ్య ఊపందుకున్నా, ప్రభుత్వం పోషక విధానాలతో పౌర భారాన్ని తగ్గించింది. ఈ స్థిరత్వం వాహన రవాణా, వ్యవసాయం, చిన్న వ్యాపారాలకు మేలు చేస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఇంధన ధరలు 20?30 శాతం పెరిగిన సమయం లో భారత్ ప్రభుత్వం పౌరాభివృద్ధి దృష్ట్యా చర్యలు తీసుకుంటోంది. డీజిల్‌పై వెయ్యి కోట్ల సబ్సిడీ, పెట్రోల్‌పై పన్ను తగ్గించి ధరలను అదుపులో ఉంచింది. దీంతో వీలయినంత తక్కువ ధరలతో పౌరులకు అందిస్తున్నారు.తప్పుడు ప్రచారంతో ప్రజల్లో గందరగోళం నెలకొంది. తాజాగా ప్రభుత్వం ముందస్తు సమాచారంతో అనవసర భయాలను నివారిస్తోంది. ఆర్థిక స్థిరత్వం కోసం ఇంధన విధానం మరింత బలపడుతుందని అంచనా.

# ఐ బొమ్మ రవి పొలిటికల్ అనలిస్ట్ అవతారం




**హైదరాబాద్,తెలంగాణ దిశ :** సినిమాల పైరసీ.. వాటిని తన వెబ్సైట్లో అప్లోడ్ చేయడం.. దానిద్వారా అక్రమంగా డబ్బు సంపాదించడం వంటి వాటిని అలవాటుగా మార్చుకున్న ఐ బొమ్మ రవి.. ఇప్పుడు కొత్త అవతారం ఎత్తాడు. తెలంగాణ పోలీసులు పట్టుకోవడం.. తమదైన స్టైల్ లో ట్రీట్మెంట్ ఇవ్వడంతో అతడు తన ధోరణి మార్చుకున్నాడు. 100 జింకలను తిన్న పులి శాంతి కపోతంగా మారినట్టు.. అక్రమ వ్యాపారానికి.. దందాలకు అలవాటు పడి.. చివరికి పోలీసులకు చిక్కిన రవి.. ఇప్పుడు పొలిటికల్ ఎనలిస్టుగా మారిపోయాడు.ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఐదు రాష్ట్రాల్లో ఎన్నికలు జరుగుతున్నాయి. ఇందులో తమిళనాడు రాష్ట్రంలో జరుగుతున్న ఎన్నికల పట్ల యావత్ దేశం మొత్తం ఆసక్తిగా ఉంది. ఎందుకంటే డిఎంకె కాంగ్రెస్, అన్న డీఎంకే బీజేపీ, టీవీకే పార్టీలు ఇక్కడ పోటీలో ఉన్నాయి. అధికారాన్ని దక్కించుకుంటామని డిఎంకె.. ఈసారి మార్పు స్పష్టంగా ఉంటుందని అన్న డిఎంకె.. ప్రజలు కొత్త తరహా రాజకీయాలను చూస్తారని టీవీ కే నేతలు చెబుతున్నారు రికార్డు స్థాయిలో 91 శాతాన్ని మించి అక్కడ పోలింగ్ నమోదు అయినట్టు వార్తలు వస్తున్నాయి. ఇంకా చాలామంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోవడానికి క్యూ లైన్ లో ఉన్నట్టు తెలుస్తోంది. సాయంత్రం ఐదు గంటల వరకే పోలింగ్ సమయం ముగియడంతో.. ఆ సమయం నాటికి పోలింగ్ కేంద్రంలో ఉన్న వారికి ఓటు హక్కు వినియోగించుకునే అవకాశాన్ని పోలీసులు ఇస్తున్నారు.పోలింగ్ నేపథ్యంలో రవి ట్విట్టర్లో ఒక ట్వీట్ చేశాడు. దాని ప్రకారం తమిళనాడు రాష్ట్ర ఎన్నికల్లో అధికార డిఎంకె మరోసారి అధికారాన్ని దక్కించుకునే అవకాశం ఉందట. విజయ్ పార్టీకి 15 నుంచి 20 వరకు ఓటింగ్ లభిస్తుందట. జన నాయకుడు సినిమా విడుదల కాకముందే లీక్ అయింది. దీంతో తమిళ ప్రజల్లో విజయ్ పట్ల సింపతి పెరిగింది. అది కాస్త టీవీకే పార్టీకి ప్లస్ అయిందని రవి భావిస్తున్నాడు.. అతడు చేసిన ఈ ట్వీట్.. సోషల్ మీడియాలో చర్చకు దారితీస్తోంది. మొన్నటిదాకా పైరసీ వ్యాపారం చేశావు.. ఇప్పుడేమో పొలిటికల్ గా మారిపోయావా.. ఏమైనాప్పటికీ నీ విశ్లేషణ వాస్తవ పరిస్థితికి దగ్గరగా ఉందని కొంతమంది అంటుంటే.. మిగతావారేమో ప్రశాంత్ కిషోర్ లాగా నువ్వు కూడా ఒక సంస్థను ఏర్పాటు చేసి.. కోట్లు సంపాదించుకో అంటూ మరి కొంతమంది వ్యాఖ్యానిస్తున్నారు.

# సీ ప్లేన్ తో పర్యటకానికి ఊపు

**విశాఖపట్టణం,తెలంగాణ దిశ :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సీప్లేన్ సేవలతో పర్యాటకు లకు సరికొత్త అనుభూతిని కల్పించేందుకు సిద్ధమైంది. దీని కోసం వాటర్ ఏరోడ్రోమ్‌ల ఏర్పాటుకు అనువైన ప్రాంతాలను గుర్తించారు. ఉత్తరాంధ్రలోని అల్లూరి సీతారామరాజు జిల్లాలో రెండుచోట్ల ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి ప్రజాభిప్రాయసేకరణ కూడా పూర్తి చేశారు. అల్లూరి జిల్లాలోని సీలేరు, జోలాపుట్టు ప్రాంతాల నుంచి సీప్లేను నడిపేందకు ఏరోడ్రోమ్‌లను ఏర్పాటు చేయనున్నారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలో పర్యాటకుల్ని ఆకర్షించేందుకు కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో సీప్లేన్‌లు నడిపేందుకు సిద్ధమైంది.. విజయవాడ నుంచి శ్రీశైలానికి ఇప్పటికే ట్రయల్ రన్ పూర్తికాగా.. మరికొన్నిచోట్ల కూడా సీప్లేన్‌లు నడిపేందుకు కసరత్తు చేస్తోంది. అమరావతి, తిరుపతి, గండికోట ప్రాంతాలలో సీప్లేన్ ప్లాన్ చేశారు. అయితే ఉత్తరాంధ్రలోని ప్రకృతి అందాలకు, పర్యాటక రంగాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు సీప్లేన్‌లు నడపాలని నిర్ణయించింది. అల్లూరిసీతారామరాజు జిల్లాలో నీటిపై తేలుతూ, గాల్లో ఎగురుతూ ప్రకృతి అందాలను తిలకించేలా ఏర్పాట్లు చేయనున్నారు. సీప్లేన్ సర్వీసులపై ప్రజాభిప్రాయసేకరణ చేశారు.జిల్లాలో సీప్లేన్‌లను జోలాపుట్టు, సీలేరు ప్రాంతాల నుంచి నడిపేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని గుర్తించారు. సీలేరులోరూ. 16.08 కోట్లు.. జోలాపుట్టులో రూ. 16 కోట్లతో ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. సీలేరులో ఉన్న గుంటవాడ జలాశయం దగ్గర ఉన్న మారెమ్మ ఆలయం దగ్గర ఏర్పాటు చేయనున్నారు. అక్కడ సమీపంలోనే భూమిని ఈ సీప్లేన్ ప్రాజెక్ట్ కోసం ఉపయోగించుకోవాలని భావిస్తున్నారు. ఇక జోలాపుట్టు జలాశయం దగ్గర సీప్లేన్ కోసం ఏర్పాట్లు చేయనున్నారు. పర్యాటకులు సీప్లేన్‌లో విశాఖపట్న నుంచి ముంచంగిపట్టు వెళ్లేలా ప్లాన్ చేస్తున్నారు. ఈ మార్గంలో అరకు అందాలను వీక్షించవచ్చు. లంబసింగి, చింతపల్లి, సీలేరు ప్రాంతాలను.. గిరిజన సంప్రదాయాలు, జీవనశైలిని చూస్తూ అలా సీలేరులో ఏర్పాటు చేసే వాటర్ ఏరోడ్రోమ్ చేరుకునేలా ఏర్పాట్లు చేయనున్నారు.సీప్లేన్ కోసం ఏరోడ్రోమ్‌లు ఏర్పాటు చేస్తే.. దాని చుట్టూ రెస్టారెంట్లు, భవనాలు, రెస్ట్ రూంలు కూడా ఏర్పాటు చేయనున్నారు. అలాగే గిరిజనులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. అరకు, లంబసింగి వంటి పర్యాటక ప్రాంతాలకు పర్యాటకులు ఎక్కువమంది వస్తుంటారు. ఈ సీప్లేన్‌లు అందబాటులోకి వస్తే.. ప్రపంచ పర్యాటకులను ఆకర్షించవచ్చని భావిస్తున్నారు. అల్లూరి జిల్లాలో రెండుచోట్ల వాటర్ ఏరోడ్రోమ్‌లు మంజూరైనట్లు జాయింట్ కలెక్టర్ శ్రీపూజ తెలిపారు. ఈ ప్రాజెక్టుపై ప్రజాభిప్రాయసేకరణ పూర్తి చేశామన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా జిల్లా పర్యాటకంగా మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. మొత్తం మీద ఉత్తరాంధ్రలోని మన్యంలో రెండుచోట్ల సీప్లేన్ ప్రాజెక్టులు రాబోతున్నాయి.. త్వరలోనే ఈ ప్రాజెక్టులపై పూర్తిస్థాయిలో క్లారిటీ వస్తుందని చెబుతున్నారు.

# ఉత్తరాంధ్రలో పుంజుకోని ఫ్యాన్



**విశాఖపట్టణం,తెలంగాణ దిశ :** ఉత్తరాంధ్ర రాజకీయాల్లో ఒకప్పుడు దూకుడుగా ఉన్న వైసీపీ ఇప్పుడు పెద్దగా కనిపించడం లేదన్న టాక్ వినిపిస్తోంది. కీలక నాయకులు ఉన్నప్పటికీ.. ఎవరికి వారు పార్టీలో స్వతంత్ర నాయకులుగా వ్యవహరిస్తున్నారన్నది వాస్తవం. ఇది .. పార్టీని ముం దుకు తీసుకువెళ్లకపోగా.. మరింత వెనక్కి నెడుతోందని తెలుస్తోంది. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన కన్నబాబును ఉత్తరాంధ్ర ఇంచార్జ్‌గా నియమించిన తర్వాత.. పార్టీలో సహకారం కొరవడింది. దీంతో ఆయనను కేవలం విశాఖకు పరిమితం చేశారు.అయినా కూడా బొత్స సత్యనారాయణ సామాజిక వర్గం పార్టీలో వేర్వేరు గ్రూపులు ఏర్పాటు చేసుకుని ముందుకు సాగుతోంది. జిల్లాల పరంగా చూసు కుంటే.. టీడీపీ,జనసేనలకు ఉన్న బలం వైసీపీకి కనిపించడం లేదు. విశాఖలో ఎంపీ భరత్ సహా టీడీపీ సీనియర్లు.. పార్టీని బలంగా ముందుకు తీసుకువెళ్తున్నారు. కానీ, ఇదేసమయంలో వైసీపీ తరఫున బలమైన వాయిస్ వినిపించే గుడివాడ అమర్నాథ్ వంటి వారికి పార్టీలో సహకారం అంతంత మాత్రమేనన్నది సీనియర్లే చెబుతున్నారు. ఇక, శ్రీకాకుళంలో ధర్మాన సోదరులపైనే వైసీపీ ఆధారపడింది. మాజీ మంత్రిసీదిరి అప్పలరాజును వైసీపీ నాయకులు పక్కన పెట్టేశారు. మరోవైపు.. ఇదే జిల్లాలో జనసేన, టీడీపీ తరఫున కింజరాపు ఫ్యామిలీ సహా.. ఇతర నాయకులు బలంగా పార్టీ లను ముందుకు తీసుకువె ళ్తున్నారు. వీరి దెబ్బతో వైసీపీ ఎక్కడా పుంజుకునే పరిస్థితి కూడా లేదని అంటున్నారు. పోనీ.. పాత నాయకులు అయినా.. బయటకు వస్తున్నారా? అంటే.. కేవలం మీడియా సమావేశాలకే పరిమితం అవుతున్నారు.ఇక, విజయనగరంలో వైసీపీ చీలికలు పేలికలుగా తయారైందన్నది పార్టీలో కొన్నాళ్లుగా చర్చ సాగుతోంది. జిల్లాలో బొత్స ప్రాతినిధ్యాన్ని తగ్గించడం ద్వారా.. వైసీపీ పెద్ద పొరపాటు చేసిందన్న వాదన వినిపిస్తోంది. ఇక, ఇదేజిల్లాలో జనసేన భారీగా పుంజుకుంటోంది. దీనికి టీడీపీ సహకారం కూడా తోడైంది. దీంతో ఉత్తరాంధ్రలోని మూడు జిల్లాలలోనూ.. వైసీపీ వర్గ పోరుతో ముందుకు సాగలేక.. వెనక్కి రాలేక ఇబ్బందులు ఎదుర్కొంటే.. జనసేన+టీడీపీ ఉమ్మడిగా జిల్లాలను దున్నేసే పరిస్థితి నెలకొంది.

## ఓటరు మ్యాపింగ్ పకడ్బందీగా నిర్వహించాలి

### అదనపు కలెక్టర్ (రెవిన్యూ) టి. వినోద్ కుమార్



**వనపర్తి,తెలంగాణ దిశ :**వనపర్తి జిల్లాలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియలో భాగంగా ఓటరు మాపింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ (రెవిన్యూ) టి. వినోద్ కుమార్ అధికారులకు ఆదేశించారు. అదనపు కలెక్టర్ వనపర్తి మండలం పెద్దగూడెం గ్రామాన్ని ఆకస్మికంగా సందర్శించి ఓటరు మాపింగ్ ప్రక్రియను పరిశీలించారు. గ్రామ పాలన అధికారులు ఈ కార్యక్రమంపై ప్రత్యేక శ్రద్ధ వహించి యుద్ధ ప్రాతిపదికన మాపింగ్ పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద వచ్చిన దరఖాస్తులను సత్వరం పరిశీలించి అర్హులైన లబ్ధిదా రులకు ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ సంబంధిత సిబ్బందిని ఆదేశించారు.

పెండింగ్‌లో ఉన్న సాధాబైనామా, భూ భారతి దరఖాస్తులను కూడా త్వరితగతిన పరిశీలించి నివేదికలు సమర్పించాలని సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో విచారణ లో ఉన్న అన్ని రకాల సేవలకు సంబంధించిన దరఖాస్తులను వేగంగా పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా, ఓటరు మాపింగ్ పనుల పురోగతిని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, గ్రామ పాలన అధికారులతో సమీక్షించారు. జిల్లాలో అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసి ఓటరు మాపింగ్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా పూర్తి చేయాలని సూచించారు.

# నేరేడి ప్రాజెక్టు డీపీఆర్ రెడీ..

**శ్రీకాకుళం,తెలంగాణ దిశ:** ఉత్తరాంధ్రవాసులు, ముఖ్యంగా శ్రీకాకుళ జిల్లావాసులు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న నేరడి బ్యారేజి నిర్మాణానికి ఇటీవల అడ్డంకులు తొలగిపోయాయి. ఏపీ ప్రభుత్వం నేరడి బ్యారేజీ నిర్మాణం పై ఫోకస్ పెట్టింది.. ఈ క్రమంలో తొలి అడుగు పడింది. తాజాగా నేరడి బ్యారేజీకి సంబంధించి రూ.70 కోట్లతో కొత్త డీపీఆర్ ప్రతిపాద నలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించారు. అలాగే ఒడిశా ప్రభుత్వాని కి కూడా త్వరలో లేఖ రాయనున్నారు. శ్రీకాకుళంజిల్లా వాసుల ఎన్నో ఏళ్ల నిజం కాబోతోంది.. దాదాపు 65 ఏళ్ల తర్వాత కీలక ముందగుడు పడింది. ఎంతో కాలంగా ఎదరు చూస్తున్న నేరడి బ్యారేజీ నిర్మాణం కోసం కొత్త డీపీఆర్‌కు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించారు. ఇటీవల వీడబ్ల్యూడీటీ (వంశధార నదీ జలాల వివాదాల ట్రైబ్యునల్) తీర్పుపై కేంద్రం గెజిట్ నోటిఫై చేసిన సంగతి తెలిసిందే.. దీంతో బ్యారేజీ నిర్మాణానికి లైన్ క్లియర్ అయ్యింది. దీంతో ఏపీ ప్రభుత్వం బ్యారేజ్ నిర్మాణంపై ఫోకస్ పెట్టింది. నేరడి బ్యారేజీ నిర్మాణానికి అడ్డంకులు తొలగిపోవడంతో కొత్త డీపీఆర్ తయారీ, సర్వే సహా ఇతర పనుల కోసం రూ.70 కోట్లు అవసరమని ప్రభుత్వా నికి ప్రతిపాదనలు పంపారు.శ్రీకాకుళం జిల్లాలో ఈ నేరడి బ్యారేజి ఆలస్యంకావడంతో నీళ్ల మళ్లింపు కోసం సైడ్ వియర్ నిర్మించారు.. కానీ ఆ ప్రయత్నం విజయవంతంకాలేదు. హిరమండలంలో ఎత్తిపోత లను ప్లాన్ చేసి.. మొత్తం 19.5 డీఎంసీల నీళ్లు మళ్లించాలని భావిం చారు.. కానీ ఆ నిర్మాణం కూడా పూర్తికాని పరిస్థితి ఉంది. ఇప్పుడు నేరడి బ్యారేజి పనులు చేపట్టి పూర్తిచేస్తే తొలిదశలో లక్షా 48వేల ఎకరాలకు నీళు అందించొచ్చని చెబుతున్నారు. రెండో రెండో దశలో మరో లక్షా 7వేల 280 ఎకరాలకు నీళ్లు ఇవ్వొచ్చంటున్నారు. సాగునీ రుతో పాటుగా తాగునీటి సమస్య కూడా తీరుతుందని.. వంశధార-నాగావళి అనుసంధానం ఫలితాలు దక్కుతాయంటున్నా రు. శ్రీకాకుళం జిల్లా భామిని మండలం నేరడి దగ్గర బ్యారేజీ నిర్మాణానికి 1961లో తొలి అడుగు పడింది.. అప్పటి నుంచి కోర్టు చిక్కులతో ఈ ప్రాజెక్టు పెండింగ్‌లోనే ఉంది. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నేరడి బ్యారేజీ అంశం గురించి కేంద్రంతో మాట్లాడారు. ఢిల్లీ వెళ్లిన సమ యంలో కేంద్ర జలశక్తిమంత్రి, ఆ శాఖ అధికారులతో సంప్రదింపులు జరిపారు. ఇటీవల నేరడి బ్యారేజ్‌కు సంబంధించి.. వీడబ్ల్యూడీటీ (వంశధార నదీ జలాల వివాదాల ట్రైబ్యునల్) తుది తీర్పును అమలు చేస్తూ గెజిట్ నోటిఫికేషన్ వచ్చేసింది. మరోవైపు ఒడిశా ప్రభుత్వం సుప్రీంకోర్టులో వేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను కూడా ఉపసంహరించుకునేలా ఏపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. సుప్రీం కోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో కోరినవాటిని పరిష్కరించేందుక అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పింది.

# అనవసర వివాదాలు..

**హైదరాబాద్,తెలంగాణ దిశ:**మనదేశంలో ఎన్నో రాష్ట్రాలు ఉన్నాయి. కేంద్ర పాలిత ప్రాంతాలు కూడా ఉన్నాయి. వీటన్నింటికీ లేని గొప్ప నేపథ్యం తెలంగాణ రాష్ట్రానికి ఉంది. ఎందుకంటే మిగతా రాష్ట్రాలు ఎటువం టి ఉద్యమ నేపథ్యం లేకుండా ఏర్పడ్డాయి. తెలంగాణ రాష్ట్రం మాత్రం ఉద్యమాలు చేస్తే.. ప్రాణాలను తృణప్రాయంగా వదిలేస్తే వచ్చింది. ఆందోళనలు, నిరవధిక నిరాహార దీక్షలు, మిలియన్ మార్చ్ లు, వంటా వార్పు లు.. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో చేస్తేనే తెలంగాణ సాకారమైంది.స్వీయ అస్తిత్వ కాంక్ష అనేది తెలంగాణ మట్టిలోనే ఉంది. అందుకే ఇక్కడ రాజకీయ చైతన్యం.. సామాజిక చైతన్యం.. ప్రజలలో ధిక్కారస్వభావం అధికంగా ఉంటాయి.. కాళోజి నారాయణ రావు..జయశంకర్.. పోటు కృష్ణమూర్తి.. ఇలా చెప్పుకుంటూ పోతే ఎంతోమంది ఉద్యమకారుల వారసత్వం తెలంగాణ లో ప్రతి ప్రాంతంలో కనిపిస్తూనే ఉంటుంది. తెలంగాణ ఉద్యమం ఏర్పడేం దు కు ప్రధాన కారణం ఆంధ్ర పాలకుల దోపిడి.. వివక్ష. వీటినుంచి తెలంగాణ తనను తాను కాపాడుకొనేందుకు అనేక రకాలుగా ఉద్యమాలు చేయాల్సి వచ్చింది. ప్రాణాలు కూడా కోల్పోవాల్సి వచ్చింది. చివరికి తెలంగాణ ఏర్పడిన తర్వాత ఇటువంటి వాతావర ణం మళ్లీ కనిపిస్తుంటే ఇంతకంటే దారుణం మరొకటి ఏమి ఉంటుంది.నాడు తెలంగాణ ఉద్యమం తీవ్రంగా సాగుతున్నప్పుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి రాకను తీవ్రంగా నిరసిస్తూ మహబూబాబాద్ లో తెలంగాణ ఉద్యమకారులు రాళ్ల దాడికి పాల్పడ్డారు. కానీ అటువంటి జగన్మోహన్ రెడ్డిని అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రగతి భవన్ కు తోడుకొని వచ్చారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి ముఖ్యఅతిథిగా ఆహ్వానిం చారు. జగన్మోహన్ రెడ్డి ప్రమాణ స్వీకారానికి కెసిఆర్ హాజరయ్యారు. అప్పట్లో చంద్రబాబుకు రిటర్న్ గిఫ్ట్ పేరుతో జగన్మోహన్ రెడ్డికి కెసిఆర్ సహాయం చేసినట్టు వార్తలు వచ్చాయి. అంతేకాదు రాయలసీ మ ను బంగారు తునక చేస్తానని.. తెలంగాణ నుంచి ఎంత నీటినైనా సరే ఇస్తానని కేసీఆర్ ప్రకటించారు.. అంతేకాదు పోతిరెడ్డిపాడు వెడల్పుకు సహకరించారు. ఇలా చెప్పుకుంటూ పోతే కేసీఆర్ జమానాలో ఆంధ్ర ప్రాంతానికి అనుకూలంగా చాలా జరిగాయి.. నాడు జాతీయ పార్టీ ఊహల్లో తేలియాడుతూ.. దేశానికి ప్రధానమంత్రి కావాలని ఆరాటంలో కేసీఆర్ చాలా చేశారు. చివరికి తనే కామారెడ్డిలో ఓడిపోయారు.ఇప్పుడు ఇదే కేసీఆర్ సరికొత్త పల్లవిఅందుకున్నారు.. నాడు తెలంగాణ ఉద్యమంలో తాను కరీంనగర్ ఉప ఎన్నికల్లో పోటీ చేస్తే.. తన మీద కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన జీవన్ రెడ్డిని ఇప్పుడు భారత రాష్ట్ర సమితిలో చేర్చుకున్నారు. ఆయనకు ఏకంగా పార్టీ ప్రధాన కార్యదర్శి పదవి ఇచ్చారు. అంతేకాదు ఆయన ను గొప్ప నాయకుడిగా పేర్కొన్నారు. నాడు ఇదే ఎన్నికల్లో తనకు వైయస్ రాజశేఖర్ రెడ్డి మాత్రమే ముఖ్యమని.. తెలంగాణ ఉద్యమంతో ఏం సంబంధం అని జీవన్ రెడ్డి వ్యాఖ్యానించారు. నాడు తన మీద వ్యతిరేకంగా పోటీ చేసిన జీవన్ రెడ్డిని పార్టీలోకి ఎలా ఆహ్వానిస్తారనేది ఇక్కడ గమనించదగ్గ విషయం.రేవంత్ రెడ్డిని తెలం గాణ ఉద్యమకారుల మీదికి రైఫిల్ తీసుకుని వెళ్ళాడు.. ఉద్యమకా రులను తిట్టాడు.. ఆంధ్ర పార్టీలో పని చేశాడు.. అంటూ విమర్శిస్తున్న గులాబీ పార్టీ నేతలు.. జీవన్ రెడ్డి రాకను ఏ విధంగా సమర్ధించు కుంటారో చెప్పాల్సి ఉంది.ఇక రేవంత్ రెడ్డి విషయానికి వస్తే.. నాడు ఎన్నికల్లో తెలంగాణ ఉద్యమకారులకు సముచిత ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. కానీ ఇంతవరకు అతిగతి లేదు. తెలంగాణ రాష్ట్రానికి ఉద్యమ గేయాన్ని రాష్ట్ర గేయంగా మార్చినప్పటికీ.. ఇంకా చేయాల్సిన పనులు చాలానే ఉన్నాయి. నాడు జీవన్ రెడ్డి పార్లమెంట్ సభ్యుడిగా పోటీలో ఉన్నప్పుడు ప్రచారం చేసింది రేవంత్ రెడ్డి. ఆయనను గొప్ప నాయకుడిగా పేర్కొంది కూడా రేవంత్ రెడ్డినే. ఇప్పుడు అదే రేవంత్ రెడ్డి జీవన్ రెడ్డిని విమర్శించారు. జీవన్ టోన్ అంటూ మండిపడ్డారు. అంతేకాదు జగిత్యాల నియోజకవర్గం లో భారత రాష్ట్ర సమితి గెలిచిన డాక్టర్ సంజయ్ కుమార్ ను గొప్ప నాయకుడిగా అభివర్ణిస్తున్నారు..వాస్తవానికి కెసిఆర్, రేవంత్ మాట్లాడుతున్న మాటలు తెలంగాణ ప్రజల్లో చర్చకు దారితీస్తున్నాయి. సోషల్ మీడియా ఇప్పుడు బలంగా ఉంది కాబట్టి గతంలో ఈ నాయకులు మాట్లాడిన మాటలను.. ఇప్పుడు మాట్లాడిన మాటలను ఒకసారి బేరీజు వేసుకుంటే అవసరాలకు తగ్గట్టుగానే ఉన్నాయి. వారి పార్టీలో ఉన్నప్పుడు ఒక విధంగా.. పార్టీ నుంచి వెళ్లిపోయిన తర్వాత మరొక విధంగా మాట్లాడటం పట్ల ప్రజలు ఈసడించుకుంటున్నారు. చివరిగా జగిత్యాల సభలో కేసీఆర్ చెప్పినట్టు దళిత బంధు లక్ష కుటుంబాలకు రాలేదు. చివరికి స్టేషన్ ఘన్ పూర్ నాటి ఎమ్మెల్యే రాజయ్య దళిత బంధు పథకాన్ని తనకు అనుకూలంగా మార్చుకుంటే.. పత్రికలలో కథనాలు రావడంతో ముఖ్యమంత్రి కార్యాలయం స్పందించాల్సి వచ్చింది. దీనిని బట్టి నాడు కేసీఆర్ అమలు చేసిన పథకాలు ఎంత గొప్పగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.రేవంత్ రెడ్డి భూపాలపల్లి జిల్లా సభలో చెప్పినట్టు అందరి రైతుల వ్యవసాయ రుణాలు మాఫీ కాలేదు. కొందరి రైతులకు రైతు భరోసా డబ్బులు కూడా బ్యాంకులు ఇవ్వకుండా రుణాలలో మినహాయించుకున్నాయి.. ఏతావాతా చెప్పేది ఏంటంటే.. కెసిఆర్ కోరుకున్నట్టుగా బంగారు తెలంగాణ కాలేదు.

## కంబదూరు గిడ్డంగిలో ఉద్రిక్తత... ఖాళీల భర్తీపై హమాలీల ఆందోళన

**కళ్యాణదుర్గం,తెలంగాణ దిశ:** కంబదూరు మండల కేంద్రంలోని పౌరసరఫరాల గిడ్డంగిలో నూతన హమాలీల ఎంపికపై ఉద్రిక్తత నెలకొంది. గిడ్డంగిలో 12 మంది హమాలీలు అవసరం కాగా ప్రస్తుతం 7 మంది మాత్రమే పని చేస్తున్నారని అభ్యర్థులు ఆరోపించారు. ఖాళీలను భర్తీ చేయాలని కోరుతూ కొత్తగా 5 మంది హమాలీ పనికి దరఖాస్తు చేసుకుని అధికారులను కలిశారు. హమాలీల కొరత కారణంగా బియ్యం అన్‌లోడ్‌కు వచ్చిన వాహనాలు మూడు రోజులుగా నిలిచిపోయాయని తెలిపారు. విషయం తెలుసుకున్న జిల్లా అధికారులు, తహసిల్దార్ జోక్యంతో పోలీసుల పర్యవేక్షణలో బియ్యాన్ని వివిధ రేషన్ స్టోర్లకు తరలించారు. అయితే ఖాళీలు వెంటనే భర్తీ చేసి పారదర్శకంగా ఎంపిక చేయాలని స్థానికులు కోరారు.





# సమీరా రెడ్డి గ్రాండ్ రీ-ఎంట్రీకి సిద్ధం...



ఒకప్పుడు టాలీవుడ్‌లో గ్లామర్, నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్న నటి సమీరా రెడ్డి మళ్లీ వెండితెరపై మెరిపించేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. సుదీర్ఘ విరామం తర్వాత ఆమె రీ-ఎంట్రీపై వస్తున్న వార్తలు సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. మెగాస్టార్ చిరంజీవి, యంగ్ టైగర్ ఎన్టీఆర్ వంటి అగ్ర హీరోల సరసన నటించి మంచి గుర్తింపు పొందిన సమీరా, పెళ్లి తర్వాత సినిమాలకు దూరమైంది. అయితే ఇప్పుడు మళ్లీ సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించేందుకు ఓ క్రేజీ ప్రాజెక్ట్‌ను ఎంపిక చేసుకున్నట్లు తెలుస్తోంది. తాజా సమాచారం ప్రకారం, ఓ స్టార్ హీరో సినిమాలో సమీరా రెడ్డి కీలకమైన పాత్రలో నటించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలిసింది. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన చర్చలు పూర్తయ్యాయని, త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశముందని సినీ వర్గాలు చెబుతున్నాయి.గతంలో కమర్షియల్ సినిమాల్లో హీరోయిన్‌గా అలరించిన సమీరా, ఇప్పుడు తన వయస్సు, అనుభవానికి తగిన ప్రాధాన్యత ఉన్న పాత్రలను ఎంచుకోవాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. పేరు కోసం కాకుండా, కథలో బలం ఉన్న పాత్రలకే ప్రాధాన్యం ఇస్తున్నట్లు సమాచారం. సినిమాలకు దూరంగా ఉన్న సమయంలో కూడా సమీరా రెడ్డి అభిమానులతో టచ్‌లోనే ఉంది. బాడీ పాజిటివిటీ, మాతృత్వం, ఫిట్‌నెస్ వంటి అంశాలపై ఆమె పంచుకున్న వీడియోలు నెటిజన్లను ఆకట్టుకున్నాయి. సెలబ్రిటీ హోదాను పక్కన పెట్టి తన వ్యక్తిగత అనుభవాలను నిజాయితీగా పంచుకోవడంతో ఆమెకు సోషల్ మీడియాలో మంచి ఫాలోయింగ్ ఏర్పడింది. ఇప్పటికే పలువురు సీనియర్ హీరోయిన్లు సెకండ్ ఇన్నింగ్స్‌లో సక్సెస్ సాధిస్తున్న నేపథ్యంలో, సమీరా రీ-ఎంట్రీపై కూడా అంచనాలు పెరిగాయి. ఈ సినిమా ఆమె కెరీర్‌లో ఒక మలుపుగా నిలుస్తుందని భావిస్తున్నారు. అయితే ఆమె నటిస్తున్న ఆ స్టార్ హీరో సినిమా ఏది? అందులో ఆమె పాత్ర ఎలా ఉండబోతోంది? వంటి వివరాలు త్వరలోనే అధికారికంగా వెలువడనున్నాయి. మొత్తానికి, సమీరా రెడ్డి రాకతో టాలీవుడ్‌లో సీనియర్ నటీమణుల హవా మరింత పెరగనుందని అభిమానులు ఆశిస్తున్నారు.

### మైఖేల్ జాక్సన్ బయోపిక్‌కు కొనసాగింపు ఉంటుందా..

# రెండో భాగంపై జోరుగా ఊహాగానాలు




పాప్ ప్రపంచానికి రారాజుగా నిలిచిన మైఖేల్ జాక్సన్ జీవిత చరిత్ర ఆధారంగా తెరకెక్కిన ప్రతిష్టాత్మక చిత్రం "మైఖేల్" ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా అభిమానులను ఆకట్టుకుంటోంది. నిజ జీవితంలో మైఖేల్ జాక్సన్ మేనల్లుడు అయిన జాఫర్ జాక్సన్ ప్రధాన పాత్రలో నటించడం ఈ సినిమాకు మరింత ప్రత్యేకతను తీసుకొచ్చింది. ఈ లెజెండరీ గాయకుడిని ఎంతగానో ఆరాధించే అభిమానులు సినిమా చూసి భావోద్వేగానికి లోనవుతున్నారు. ఈ బయోపిక్‌లో మైఖేల్ జాక్సన్ జీవితంలోని ముఖ్య ఘట్టాలను ఆవిష్కరించిన తీరు ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. అయితే సినిమా విడుదలైన వెంటనే మరో ఆసక్తికరమైన చర్చ మొదలైంది. అదేంటంటే... ఈ కథను ఒక్క భాగంలోనే ముగిస్తారా? లేక రెండో భాగం కూడా ఉంటుందా? అనే ప్రశ్న. ఈ సందేహాలకు కారణం సినిమా ద్వితీయార్ధంలో కనిపించే కొన్ని సూచనలు. కథ పూర్తిగా ముగియకుండా, మరింత చెప్పాల్సిన అంశాలు మిగిలినట్లుగా చూపించడంతో రెండో భాగంపై సంకేతాలు ఇచ్చినట్టుగా అభిమానులు భావిస్తున్నారు. ఇదే సమయంలో రెండో భాగానికి సంబంధించిన శీర్షికపై కూడా ఊహాగానాలు మొదలయ్యాయి.ప్రస్తుతం వినిపిస్తున్న ప్రచారం ప్రకారం, మొదటి భాగం "మైఖేల్"గా విడుదల కాగా, రెండో భాగానికి "మైఖేల్ జాక్సన్" అనే పూర్తి పేరునే టైటిల్‌గా పెట్టవచ్చని వార్తలు వినిపిస్తున్నాయి. ఇది వినడానికి సాధారణంగా అనిపించినా, ఇందులో ఒక లోతైన భావన ఉందని సినీ వర్గాలు చెబుతున్నాయి. మొదటి భాగంలో వ్యక్తిగత జీవితాన్ని, రెండో భాగంలో ఆయన సంపూర్ణ లెజెండరీ ప్రయాణాన్ని చూపించేలా ప్లాన్ చేస్తున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాదు, రెండో భాగాన్ని 2028 ఏప్రిల్‌లో విడుదల చేసే అవకాశముందన్న మరో వార్త కూడా ప్రచారంలో ఉంది.అయితే ఈ విషయాలపై చిత్ర బృందం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు.దీంతో ఇవన్నీ కేవలం ఊహాగానాలేనా? లేక నిజంగానే రెండో భాగం వస్తుందా? అన్న ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. మొత్తానికి, "మైఖేల్" సినిమా విజయంతో మైఖేల్ జాక్సన్ జీవిత కథపై మరింత ఆసక్తి పెరిగింది. రెండో భాగంపై వస్తున్న ఈ వార్తలు నిజమైతే, ఈ లెజెండరీ బయోపిక్ అరుదైన ఘనతను సొంతం చేసుకునే అవకాశముంది.

### మండాడి షూటింగ్ కంప్లీట్..

# గెట్ రెడీ అంటోన్న సుహాస్, సూరి..

తెలుగు ప్రేక్షకులకు పెద్దగా ఇంట్రడక్షన్ అవసరం లేని యాక్టర్ సుహాస్. ఈ టాలెంటెడ్ యాక్టర్ మండాడి సినిమాతో కోలీవుడ్‌లోకి కూడా ఎంట్రీ ఇస్తున్నాడని తెలిసిందే. కథను నమ్మి సినిమా చేసే సుహాస్ ఇక తమిళంలో కూడా తన లక్‌ను పరీక్షించుకోవాలనుకుంటున్నాడు. సెల్ఫీ ఫేంమతిమారన్ పుగళేంది డైరెక్ట్ చేస్తున్న ఈ చిత్రంలో కోలీవుడ్ యాక్టర్ సూరి మరో లీడ్ రోల్‌లో నటిస్తున్నాడు. తీర ప్రాంతం, మత్స్యకారుల నేపథ్యంలో సాగే ఈ స్పోర్ట్స్ డ్రామా షూటింగ్ పూర్తయింది. జెట్‌స్పీడ్‌తో పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. చాలెంజింగ్ షెడ్యూల్‌తో షూటింగ్ పూర్తయిందనితెలిపారు మేకర్స్. సినిమా రియలిస్టిక్‌గా ఉండాలనే ఉద్దేశంతో రియల్ లొకేషన్స్‌లో షూట్ చేయడం విశేషం. ఈ మూవీ నుంచి ఇప్పటికే విడుదల చేసిన పోస్టర్లు నెట్టింట,మూవీ లవర్స్‌లో హైప్ క్రియేట్ చేస్తున్నాయి. సుహాస్, సూరి టీంపై వచ్చే హై ఇంటెన్సిటీతో సముద్రంలో సాగే యాక్షన్ పార్ట్‌తోపాటు సెయిల్ బోట్ రేస్ సినిమాకే హైలెట్‌గా ఉండబోతుందంటూ అప్‌డేట్స్ కూడా వచ్చాయి. ఈ సీక్వెన్స్ కోసం సూరి, సుహాస్ టీం ప్రత్యేకంగా ఆరు నెలలపాటు కఠిన శిక్షణ పొందారని ఇన్‌సైడ్ టాక్. పాన్ ఇండియా స్థాయిలో తెలుగు, తమిళం, హిందీ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ మూవీకి పాపులర్ యాక్షన్ కొరియోగ్రఫర్ పీటర్ హెయిన్స్ పనిచేస్తుండటంతో అంచనాలు అమాంతం పెరిగిపోతు న్నాయి. ఈ మూవీకోసంసుహాస్‌వందరోజులను కేటాయించాడు. ఈ మూవీకి జీవీ ప్రకాశ్‌కుమార్ సంగీతం అందించగా.. ఎస్ఆర్ కథిర్ సినిమాటోగ్రఫర్‌గా పనిచేస్తున్నారు.

# నా జుట్టు మెరుపు వెనుక ఉన్న రహస్యం ఇదే... శ్రేయా ఘోషాల్




ప్రముఖ గాయని శ్రేయా ఘోషల్ తన పొడవైన, నిగనిగలాడే జుట్టు వెనుక ఉన్న రహస్యాన్ని అభిమానులతో పంచుకున్నారు. లండన్‌లో బ్రిటిష్ వోగ్ మ్యాగజైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో, తన జుట్టు అందానికి కారణంఒక సాధారణ భారతీయ చిట్కాఅయిన 'కొబ్బరి నూనె' అని ఆమె వెల్లడించారు. ఈ సింపుల్ సమాధానం ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌అవుతోంది. కన్సర్ట్ టూర్‌లో భాగంగా లండన్ వెళ్లిన శ్రేయా, అక్కడి ప్రతిష్ఠాత్మక ఓ2 ఎరీనాలో హౌస్‌ఫుల్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఓఇంటర్వ్యూలో, "మీ జుట్టు ఇంత అందంగా, మెరిసిపోతూ ఎలా ఉంటుంది?" అని అడిగిన ప్రశ్నకు ఆమె బదులిస్తూ "ఇండియన్ చిట్కా...కొబ్బరి నూనె" అనినవ్వుతూ చెప్పారు. ఈ కచేరీలో ఆమె పొడవైన జుట్టుతో ప్రత్యేకంగా కనిపించ గా, ఆ లుక్‌పై అభిమానులు ప్రశంసలు కురిపించారు. ఇదే వేదికపై ఆమె లెజెండరీ సింగర్ ఆశా భోస్లేకునివాళి అర్పించారు.ఆశా ఆలపిం చిన "దమ్ మారో దమ్", "అభీ నా జావో ఛోడ్ కర్" వంటి క్లాసిక్ పాటలను పాడి ఆమె సంగీత సేవలను గుర్తుచేసుకున్నారు. ఒక అంతర్జాతీయ స్టార్‌గా ఉండి కూడా శ్రేయా ఘోషల్ తన మూలాలను మర్చిపోకుండా, భారతీయ సంప్రదాయ పద్ధతులనే అనుసరించడం ఆమె సరళతను తెలియజేస్తోందని పలువురు ప్రశంసిస్తున్నారు.

# పెయిడ్ సబ్‌స్క్రిప్షన్ ట్రెండ్‌లోకి మరో బ్యూటీ!



ఈ మధ్యకాలంలో బాగా వార్తలలో నిలుస్తోన్న అంశం.. సెలబ్రిటీల 'పెయిడ్ సబ్‌స్క్రిప్షన్స్'. సోషల్ మీడియా అకౌంట్స్‌లో ఫాలోయర్స్‌ని పెంచుకుంటూ, వారికి అందాల ఎర వేస్తూ, సబ్‌స్క్రిప్షన్ వైపు నడిపించుకుంటున్నారు. కాస్త పేరున్న భామలందరూ ఇప్పుడీ బాటలోనే నడిచేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే విష్ణు ప్రియ, అనన్య నాగళ్ల వంటి నటీమణులు ఈ పద్ధతి ద్వారా తమ సోషల్ మీడియా క్రేజ్‌ని, ఆదాయ మార్గంగా మార్చుకోగా.. ఇప్పుడు మరో సోషల్ మీడియా స్టార్ అషు రెడ్డి, కూడా అదే బాటలో పయనిస్తున్నారు. తాజాగా ఆమె కూడా ఇన్‌స్టాగ్రామ్‌లో 'పెయిడ్ సబ్‌స్క్రిప్షన్స్' ట్రెండ్‌లోకి అడుగుపెట్టినట్లుగా చెబుతూ ఓ వీడియోను షేర్ చేశారు. ఇప్పుడా వీడియో వైరల్ అవుతోంది. నటిగా, బిగ్ బాస్ ఫేమ్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు ఉన్న ఈ బ్యూటీ, తన ఫాలోయర్స్ కోసం నెలకు రూ. 399 రుసుముతో ఎక్స్‌క్లూజివ్ కంటెంట్‌ను అందుబాటులోకి తీసుకురాబోతున్నట్లుగా ఈ వీడియోలో నవ్వుతూ తెలుపుతున్నారు. ప్రస్తుతం ఆమెకు ఇన్‌స్టాగ్రామ్‌లో రెండు మిలియన్లకు పైగా ఫాలోయర్స్ ఉన్నారు. సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉంటూ, తాజా ఫొటో షూట్స్‌తో సందడి చేసే అషు రెడ్డి, తన పాపులారిటీని క్యాష్ చేసుకునే ప్రయత్నంలో సక్సెస్ అయ్యారు. సబ్‌స్క్రిప్షన్ ఫీచర్‌ను లాంచ్ చేసిన ఒక్క రోజులోనే ఆమెకు దాదాపు 700 మందికి పైగా సబ్‌స్క్రైబర్లు చేరడం విశేషం. ఈ లెక్కన చూస్తే, కేవలం ఒక్క రోజులోనే దాదాపు రూ. 3 లక్షల ఆదాయాన్ని సునాయాసంగా అందుకున్నారని తెలుస్తోంది. రానున్న రోజుల్లో ఈ సబ్‌స్క్రైబర్ల సంఖ్య మరింత పెరిగే అవకాశం లేకపోలేదు. ఎందుకంటే అమ్మడి పరువాల పవర్ అలాంటిది మరి.రామ్ గోపాల్ వర్మకే మతిపోగొట్టిన అందం అషు రెడ్డి సొంతం. అలాంటి భామ అందరికీ పరువాల విందు ఇస్తానంటే, పైకం చెల్లించకుండా ఉండగలరా? అందుకే, సబ్‌స్క్రైబర్ అయ్యేందుకు క్యూ కడుతున్నారు. తెలుగు సినిమాల్లో కొన్ని పాత్రలతో మెరిసినప్పటికీ, అషు రెడ్డికి సోషల్ మీడియాలో ఉన్న క్రేజ్ అసాధారణమని చెప్పొచ్చు. ముఖ్యంగా ఆమె షేర్ చేసే గ్లామరస్ ఫోటోషూట్స్, వీడియోలకు యూత్ నుండి భారీ స్థాయిలో ఆదరణ లభిస్తుంటుంది. తనకంటూ ఉన్న ఈ బలమైన ఫాలోయింగ్‌ను, అభిమానులకు ఇలా సబ్‌స్క్రిప్షన్ పేరిట కొత్త ఆదాయ వనరుగా మార్చుకుంటోంది. ప్రస్తుతం ఈ అంశంపైనే భారీ స్థాయిలో చర్చలు నడుస్తున్నాయి. ఈ సబ్‌స్క్రిప్షన్ విషయమై పోలీసులకు కూడా ఫిర్యాదులు అందుతున్నట్లుగా తెలుస్తోంది. ఆల్రెడీ విష్ణు ప్రియపై కేసు కూడా నమోదైంది. మరి, ఈ విధానానికి అంతం, అదుపు.. ఏ రూపంలో ఉంటుందనేది తెలియాలంటే మాత్రం వేచి చూడాల్సిందే.

# యాక్షన్ మోడ్‌లో రౌడీ జనార్ధన



శ్రీకాకుళం నేపథ్యంతో కూడిన 80వ దశకపు పొలిటికల్ యాక్షన్ డ్రామా 'రౌడీ జనార్ధన'. అగ్ర కథానాయకుడు విజయ్ దేవరకొండ టైటిల్ రోల్ పోషిస్తున్న ఈ చిత్రంలో కీర్తిసురేశ్ కథానాయిక. రవికిరణ్ కోలా దర్శకుడు. దిల్‌రాజు నిర్మాత. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతున్నది. ఇటీవల విడుదల చేసిన గ్లింప్స్‌లో విజయ్ దేవరకొండ మేకోవర్, ఆయన సంభాషణలు పలికిన తీరు, అభిమానుల్నీ, సినీ ప్రేమికులను విశేషంగా ఆకట్టుకున్నది. ఈ గ్లింప్స్ సినిమాపై అంచనాలను కూడా పెంచింది. దిల్‌రాజు ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మే చివరివారం హైదరాబాద్ ఆర్ఎఫ్‌సీలో ఈ సినిమాకు సంబంధించిన కొత్త షెడ్యూల్ మొదలుకానున్నది. ఈ షెడ్యూల్‌లో భారీ యాక్షన్ సీక్వెన్స్‌తో పాటు ఓ పాటను కూడా చిత్రీకరిస్తారు. ఇదిలావుంటే.. ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్ ఈ సినిమాకు హైలైట్‌గా నిలుస్తుందని ఇన్‌సైడ్ టాక్.

ఈ ఎపిసోడ్‌లో విజయ్ పూర్తి యాక్షన్ మోడ్‌లో కనిపిస్తారట. మునుపెన్నడూ లేనంతగా ఊరమాస్ పాత్రలో విజయ్ నటిస్తుండటంతో ఈ సినిమా అంచనాలు భారీగా ఏర్పడ్డాయి. షూటింగ్ పూర్తి చేసి, ఈ ఏడాది చివర్లో సినిమాను విడుదల చేయనున్నారు.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. RNI. NO: TELTEL/2023/88215